ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



బాపట్ల జిల్లా వార్తలు

5

గురువారం 24 ఏప్రిల్ 2025

ఉష్ణోగ్రత (అంచనా)

24-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	40	27
తెనాలి	39	27
నరసరావుపేట	41	24
బాపట్ల	37	28
రెంటచింతల	42	25

ప్రధాని పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

- సభా వేదిక వద్దకు చేరుకునేందుకు 8 రోడ్లు గుర్తింపు
- సభకు చేరుకునేందుకు ఈ- 11, 13, 15 రోడ్లు సిద్ధం
- 1.1 కి.మీ మేర ప్రధాని రోడ్ షో.. 5 లక్షల మందితో సభ
- పోలీస్ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి
- రూ. లక్ష కోట్ల విలువైన పనులను పీఎం మోదీ ప్రారంభిస్తారన్న మంత్రి నారాయణ

8



రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఐజీ త్రిపాఠి

మొక్కజొన్న పేరుతో.. మెక్కేస్తున్నారు..

- అడ్వాన్స్‌డు రైల్వే ర్యాక్ బుకింగ్... ఆపై వసూళ్ల పర్వం
- ర్యాక్‌కు రూ. 3 నుంచి రూ. 4 లక్షల డిమాండ్!
- ఒక్క తెనాలి నుంచే లక్ష టన్నుల మొక్కజొన్నలు రవాణా
- గత వైసీపీ ప్రభుత్వ కాలంలో మొదలయిన వసూళ్లు
- డెల్టాలో అధికార, ప్రతిపక్ష పార్టీ అనుచరుల మధ్య వసూళ్ల వివాదం
- వ్యాపారులకు తలనొప్పిగా మారిన వైనం



తెనాలి రైల్వే స్టేషన్‌లో రైల్వే గూడ్స్ వ్యాగన్‌కు సరకు లోడ్ చేసేందుకు వరుసలో ఉన్న మొక్కజొన్న లారీ

మొక్కజొన్న పండించిన రైతు... వారి దగ్గర నుంచి పంట కొనుగోలు చేసిన వ్యాపారులు... ఇద్దరూ కాదని వీరి మధ్యలో వసూళ్ల రాయుళ్లు. వారికి అధికార పార్టీ నేతల అండదండలు. వెరసి రైల్వే గూడ్స్ వ్యాగన్‌ల వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. ఆనాడు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ ప్రభుత్వ కాలంలో వసూళ్ల పర్వానికి తెరలేపితే, నేడు కూటమి నేతల మధ్య అదే అగ్గి రాజేస్తోంది. తమ వారికి వసూలు చేసుకునే అవకాశం కావాలంటే... లేదు మా వారే వసూలు చేసుకుంటారంటూ తెనాలి, బాపట్ల, విజయవాడ, ఏలూరు ప్రాంతాల వ్యాపారుల తరపున నేతలు వత్తిడి చేయటం చూస్తే ఇది మంచి ఆదాయ వనరుగా కనిపిస్తుంది. రూ. లక్షో రూ. 2 లక్షలో కాకుండా రూ. కోటిన్నర ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుని అధికార పార్టీ నేతలు దందాకు తెరతీశారు. దీంతో ఈ వ్యవహారం కాస్తా ప్రభుత్వ పెద్దల దృష్టికి చేరిపోవటం, మీరెవరూ వద్దని, వ్యాపారుల మధ్యలో వేలుపెడితే ఊరుకునేదిలేదంటూ చివాట్లు పెట్టటం కొసమెరుపు. ఎగుమతి 'సుంకాల' వ్యవహారానికి సంబంధించి వివరాల్లోకి వెళితే...

గుంటూరు, బాపట్ల, తెనాలి, ఏప్రి ల్ 23, (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టాలో రబీ కింద మొక్కజొన్న, జొన్న పంటలు సాగవుతున్నాయి. 5.71 లక్షల ఎకరాల విస్తీర్ణంలో 4.5 లక్షల ఎకరాల వరకు మొక్కజొన్న, జొన్న పంటలు సాగవుతుంటే, దిగుబడులు ఈ సంవత్సరం ఆశాజనకంగా నే ఉన్నాయి. అయితే మొక్కజొన్నకు మద్దతు ధరతో పోల్చితే పర్వాలేదనిపించేలా మార్కెట్ రేటు ఉన్నా, తెల్ల జొన్నకు రేటు లేదు. అయితే రైతులు మాత్రం పండించిన పంట ను నిల్వ ఉంచుకునే అవకాశం లేక, ఆ ధైర్యంకూడా చేయలేక వ్యాపారులకే వచ్చిన ధరకు అమ్మేస్తున్నారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో ఉన్న మొత్తం సాగు విస్తీర్ణంలో ప్రస్తుతానికి సగం విస్తీర్ణంలో మొక్కజొన్న, జొన్న కోత పూర్తయితే, మరికొంత విస్తీర్ణం మే, జూన్ నెలల్లో పూర్తవుతుంది. చిన్న వ్యాపారులు ఇప్పటికే మొక్కజొన్న, జొన్న రైతుల నుంచి కొంటున్నారు. అయితే వీటిని ఎగుమతి దారులకు అమ్మకాలు సాగించాల్సి ఉంది. అది జరగాలంటే సరకు ఇతర రాష్ట్రాలకు పంపేందుకు రైల్వే ర్యాక్‌లు అవసరం అవుతుంది. ఇక్కడే అసలు రాజకీయం మొదలవుతోంది.

ర్యాక్‌ల వసూళ్ల రగడ వైసీపీ ప్రభుత్వ కాలం నుంచే...

వ్యాపారులు తాము కొన్న సరకును ఇతర రాష్ట్రాలు, దేశాలకు పంపాలంటే మనకు అనుకూలంగా ఉన్నది రైల్వే రవాణా వ్యవస్థే కీలకం. దీనికోసం రైల్వే ర్యాక్‌లను బుక్ చేసుకోవలసి ఉంటుంది. ఒక్కో ర్యాక్‌లో 2,500 టన్నుల సరకు రవాణా చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇంత మొత్తంలో ఒకే వ్యాపారి కొనలేరు కనుక కొంత మంది వ్యాపారులు కలసి ఒక ర్యాక్ చొప్పున బుక్ చేసుకుని సరకును తమిళనాడు, కర్నాటక వంటి రాష్ట్రాలకు పంపుతారు. అక్కడి ఎగుమతి దారులు ఆ సరకును దింపుకుని ఇతర దేశాలకు ఎగుమతి చేసుకోవటం పరిపాటి. అయితే ఇక్కడే ర్యాక్‌ల లొల్లి మొదలయింది. గూడ్స్ వ్యాగన్‌ల అవసరాన్ని గుర్తించిన కొందరు దళారులు మధ్యలో చేరిపోయారు. గత వైసీపీ ప్రభుత్వ కాలం నుంచి ఈ కొత్త దందాకు తెరలేపారు. వ్యాపారుల స్థానంలో కొందరు దళారులు ముందుగానే ర్యాక్‌లు బుక్‌చేసుకుని పెట్టేస్తారు. వ్యాపారులకు అవసరమైన సమయంలో వాటిని తెప్పించి సరకు లోడ్ చేసుకుని పంపాలంటే (మిగతా 8వ పేజీలో)

బిల్లులు.. బాధలు

మూడు జిల్లాల్లో రూ.కోట్లలో పెండింగ్



- పూర్తయిన పనులకు నెలలుగా విడుదల కాని నగదు
- అప్పుల పాలై వడ్డీలు కట్టలేక పోతున్నామని నేతల ఆవేదన
- బిల్లులు వస్తే చాలు.. కొత్త పనుల జోలికి వెళ్లబోమంటున్న నేతలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- పల్నాడు జిల్లాలో 80.49 కోట్లు.., బాపట్ల జిల్లాలో రూ.58.18 కోట్లు.., గుంటూరు జిల్లాలో రూ.15.79 కోట్లు.. ఇలా బిల్లులు పేరుకుపోయాయి.
- పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు సంబంధించి రూ.154.46 కోట్ల బిల్లులు చెల్లింపులు నిలిచిపోయాయి.
- పల్నాడు జిల్లాలో 702కు 513, బాపట్ల జిల్లాలో 691కు 539, గుంటూరు జిల్లాలో 383కు 259 మినీ గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. అయితే ముందుగా చెప్పిన విధంగా విడతల వారీగా బిల్లులు చెల్లింపులు జరగడంలేదు. మూడు జిల్లాల్లో రూ.19 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు అధికారుల లెక్కలు తెలియజేస్తున్నాయి.
- 2019కి ముందు గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో దాదాపు రూ.106 కోట్లు బిల్లుల బకాయిలు ఉన్నట్లు పశు సంవర్ధకశాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి.

మన ప్రభుత్వం వచ్చింది.. పనులు చేస్తే వెంటనే బిల్లులు వస్తాయి.. అని అప్పులు చేసి పనులు చేసిన కూటమి పార్టీల్లోని ద్వితియ శ్రేణి నేతలు అప్పుల పాలై అల్లాడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దఎత్తున అభివృద్ధి పనులు మంజూరయ్యాయి. దీంతో గ్రామ, మండల స్థాయిల్లో నేతలు పెద్దఎత్తున పనులు చేపట్టారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు వంటి పనులను పెద్దఎత్తున చేశారు. అయితే పను లు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా, వాటికి సంబంధించి బిల్లులు రావడంలేదు. బిల్లులు ఇప్పించాలని కొన్ని చోట్ల ఎమ్మెల్యే లపై నేతలు ఒత్తిడి తెస్తున్నారు. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో పనులు ఇస్తాం తీసుకోమంటున్నా ఎవరూ ముందుకు రావడం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. పార్టీ గెలుపు కోసం ఎంతో శ్రమించాం.. ప్రగతి పనులు చేస్తే కొంత ఆదాయం వస్తుందనే ఆశతో టీడీపీ నేతలు చాలావరకు అప్పులు చేసి మరీ ఉపాధి హామీ పథకం కింద పనులు చేశారు. ఈ బిల్లులు కూడా నెలల తరబడి చెల్లించ డంలేదు. పల్లె పండుగ పథకం ప్రారంభంలో వారం వారం బిల్లుల చెల్లింపులు జరిగాయి. మొదటి రెండు వారాలు చెల్లింపులు సక్రమంగా జరిగాయి. దీంతో బిల్లులు వెంటనే వస్తాయనే ఆశతో పలువురు పెద్దఎత్తున పనులు చేశారు. బిల్లుల చెల్లింపులు నిలిచి పోవడంతో వారు ఖంగుతిన్నారు.

గతంలోనూ.. ఇప్పుడూ ఒకతీరు

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో కూడా పార్టీ నేతలు పెద్దఎత్తున పనులు చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆయా బిల్లులను ఆపేసింది. దీంతో చాలామంది అప్పులు పాలయ్యారు. కొందరు కోర్టులను ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాత బిల్లులు చెల్లిస్తారని పలువురు ఆశపడ్డారు. అయితే పాత బిల్లుల ఊసే ప్రభుత్వం ఎత్తక పోతుండటంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో వలె కాకుండా పనులు చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తారనే ఆశతో పనులు పెద్దఎత్తున చేపట్టగా గతంలోని పరిస్థితి ఎదురవడంతో నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు చెల్లింపు విషయంలో పనులు చేసిన నేతలకు ప్రభుత్వం చుక్కలు చూపెడుతోంది. పనులు చేసి అప్పులు పాలయ్యామని వడ్డీలు కట్టలేక పోతున్నామంటూ నేతలు ఎమ్మెల్యేల ఎదుట ఆవేదన వక్తం చేస్తున్నారు. గతంలో, ఇప్పుడు బిల్లులు నిలిచిపోవడంతో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సీసీ రోడ్డు



పదిలో 12వ స్థానం

- జిల్లాలో 83.96 శాతం ఉత్తీర్ణత
- గత ఏడాది కంటే తగ్గిన ఉత్తీర్ణత
- పదో తరగతి ఫలితాల్లో బాలికలదే పైచేయి



దివ్యశ్రీ (596)



సుహిత (594)

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 83.96 శాతం ఉత్తీర్ణతతో జిల్లా పన్నెండో స్థానంలో నిలిచింది. గత నెలలో జరిగిన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా మొత్తం 16,182 మంది విద్యార్థులు హాజరు కాగా 13,586 మంది ఉత్తీర్ణత సాధించారు. వారిలో 6,615 మంది బాలురు, 6,971 మంది బాలికలు ఉన్నారు. ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. బాలుర ఉత్తీర్ణతా శాతం 81.24గా ఉండగా, బాలికలది 86.71గా ఉంది. గతేడాది జిల్లా 14వ స్థానంలో నిలిస్తే, ఈసారి రెండు స్థానాలు ఎగబాకి 12 వస్థానంలో నిలవడం గమనార్హం. మొదటి శ్రేణిలో 11,135 మంది, ద్వితీయ శ్రేణిలో 1,743 మంది, మూడో డివిజన్‌లో 708 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో వందశాతం ఫలితాలు సాధించిన పాఠశాలలు ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 58 ఉన్నాయి.

దివ్యశ్రీకి 596 మార్కులు

జిల్లాలోని పందిళ్లపల్లి జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న సజ్జా దివ్యశ్రీ 596 మార్కులు సాధించగా, పెసర్లంక జడ్పీ హైస్కూల్ విద్యార్థిని త్రిపురనేని సుహిత 594 మార్కులతో మెరిసింది. బాపట్లలోని సరస్వతీమెమోరియల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్.జహూరా 593 మార్కులు సాధించింది. విద్యార్థినిని ప్రిన్సిపాల్ ఆవుల వెంకటేశ్వర్లు, బుజ్జమ్మ, శర్మ, మరకతవల్లి, దేవిక తదితరులు సత్కరించారు. ఈపురుపాలెం విద్యార్థిని వూట్ల హిమబిందు, చెరుకూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థిని నెల్లూరి మహాలక్ష్మి, శంకవరప్పాడు విద్యార్థి భూపతి తేజశ్వంత్‌లు 592 మార్కులు సాధించారు.

బీసీ వసతిగృహంలో నూరు శాతం..

బాపట్లలోని బీసీ బాలుర వసతిగృహాల విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ డి.వి.ఎస్.నాగరాజు తెలిపారు. కర్లపాలెం ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ హాస్టల్ మారుబోయన జగదీష్‌రెడ్డి 515, భవానీ శంకర్‌రెడ్డి 515, పుచ్చకాయల వెంకటేశ్వర్లు 506 మార్కులు సాధించారన్నారు.



593 మార్కులు సాధించిన బాపట్ల సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని జహురాను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

సర్టిఫికెట్లు.. సతమతం

- డీఎస్సీ దరఖాస్తుదారులకు చిక్కులు
- కుల, ఆధార్, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం పాట్లు
- జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో స్పందించని సిబ్బంది
- సమీపిస్తున్న గడువు.. నిరుద్యోగ ఉపాధ్యాయుల్లో ఆందోళన

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏడేళ్ల తర్వాత డీఎస్సీ (జిల్లా నియామక కమిటీ)-2025 నోటిఫి కేషన్ విడుదలైంది. అయితే ఎంతోకాలంగా డీఎస్సీ కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ ఉపాధ్యాయులు సంతోషించే లోపే సర్టిఫికెట్ల అప్‌లోడింగ్ కోసం పెట్టిన నిబంధనలు చూసి మనోవేదనకు గురౌతున్నారు. గతంలో పరీక్ష రాసేందుకు విద్యార్హతల సర్టిఫికెట్లు మాత్రమే అప్‌లోడింగ్ చేస్తే సరిపోయేది. ఇప్పుడు ఆధార్, కుల, ఆదాయం, నివాస తదితర సర్టిఫికెట్లు అప్‌లోడింగ్ చేయాలని నిబంధన పెట్టారు. అయితే ఈ నిబంధన పురుషులకు ఎలాంటి ఇబ్బంది లేదు. వివాహితులకు సమస్యలు సృష్టిస్తున్నది. ఇందుకు కార ణం వారి విద్యార్హతల సర్టిఫికెట్లు తండ్రి ఇంటి పేరుపై ఉండగా ఇతర ధ్రువీకరణ పత్రాలు భర్త ఇంటి పేరుతో ఉంటాయి. ఇప్పుడు వాటిని మార్చుకోవాలంటే పాత సర్టిఫికెట్ల రిఫరెన్స్ నంబర్లను రెవెన్యూ అధికారులు అడుగు తున్నారు. అయితే ఆ రిఫరెన్స్ నంబర్లు లేక పోవడంతో దరఖాస్తు దారులు జాయింట్ కలెక్టర్ కార్యాలయానికి వస్తుండగా సిబ్బంది సరిగా స్పందించడం లేదు. పైగా సీసీఎల్ఏ(భూపరిపాలన ముఖ్య కమి షనర్ కార్యాలయాని)కి వెళ్లమంటూ ఉచిత సలహాలు ఇస్తుండటంతో దరఖాస్తు దారులు ఆవేదన చెందు తున్నారు.

15వ తేదీ వరకే గడువు..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,143 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గత వారంలో నోటిఫికేషన్ విడుదలైంది. మే 15వ తేదీ లోపు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉన్నది. ఇందుకోసం తొలుత దరఖాస్తుదారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆ తర్వాత అం దులో ఖాళీలు నింపి, అవసరమైన పత్రాలు అప్‌లోడ్ చేసి నగదు చెల్లిస్తేనే విజయవంతంగా దరఖాస్తు అప్ లోడింగ్ జరుగుతుంది. ఇక్కడే అసలు సమస్య వచ్చి పడింది. కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరం మేరకు ఎప్పటి కప్పుడు తహసీల్దారు కార్యాల యాల నుంచి తీసుకొంటుంటారు. సర్టిఫికెట్ తీసుకొన్న ప్రతీసారి రిఫరెన్స్ నంబరు మారిపోతుంటుంది. ఈ నేపథ్యంలో ఇప్పుడు తాజాగా ఆయా సర్టిఫికెట్లు కావా లంటే పాత రిఫరెన్స్ నంబర్లను అడుగుతున్నారు. అవి దరఖాస్తుదారుల వద్ద అందుబాటులో లేవు. గతంలో మీ-సేవ సర్వీసులు ఉన్నప్పుడు వారి వద్ద డేటా ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్వీసులు మీ-సేవ నుంచి తీసేసి గ్రామ/వార్డు సచివాలయాలకు మార్చారో అప్పటి నుంచి పాత రిఫరెన్స్ నంబర్లు కని పించడం లేదు. ఒకవైపు దరఖాస్తు చేసుకోవడానికి గడవు సమీపిస్తుండగా అధికారుల నుంచి సహకారం అందకపోవడంతో ఔత్సాహికులు ఆందోళన చెందుతు న్నారు. తమకు విద్యార్హతలలో ఏ ఇంటి పేరుతో అయి తే సర్టిఫికెట్లు ఉన్నాయో వాటి పేరుతోనే కులధ్రువీకరణ, నివాస, ఆదాయం, ఈడబ్ల్యూఎస్ తదితర సర్టిఫికెట్లు మంజూరు చేయాలని వేడుకుంటున్నారు. ఆధార్‌లో పేరులో సవరణలు చేసుకోవడానికి పరిమితి ఉన్నది. జీవితకాలంలో కేవలం రెండేసార్లు పేర్లు అప్‌డేట్ చేసుకోవచ్చు. అంతకుమించి చేయడానికి వీల్లేదు. అయితే ఇప్పటికే చాలామంది తెలియక ఆధార్‌లో పేర్లను అప్‌డేట్ చేసుకున్నారు. దీంతో వారికి తాజాగా మరోసారి మార్పు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఒక సర్టిఫికెట్ కి, మరో దానికి ఏమైనా చిన్న మార్పులు ఉంటే తహసీల్దార్లు రెండూ ఒకటే అని ప్రత్యేకంగా గతంలో ధృవీకరించేవారు. ఇప్పుడు అలా చేయడంలేదు. ఇలాంటి సమస్యలతో కలెక్టరేట్‌కు వస్తున్న వారికి సహకరించాల్సిన సిబ్బంది అందుకు విరుద్ధంగా వ్యవ హరిస్తుండటంపై అభ్యర్థులు ఆందో ళన చెందుతున్నారు. దీనిపై గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి తగిన ఆదేశాలను అధికారులకు ఇవ్వాలని అభ్యర్థులు కోరుతున్నారు.

వీరయ్య హత్యలో.. రేషన్ మాఫియా?

- పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు
- బాపట్ల రైస్‌మిల్ యజమాని సహా చీరాలకు చెందిన మరో ఇద్దరు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ప్రకాశం జిల్లా సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకు సంబంధించి బాపట్ల జిల్లాలోనూ లింకులు ఉన్నట్లు తెలుస్తోంది. బాపట్ల మండల పరిధిలోని వెదుళ్లపల్లికి చెందిన ఓ రైస్ మిల్లు యజమానిని ఒంగోలు పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఈ హత్య కేసు ఛేదించే క్రమంలో పోలీసులు ఒంగోలుకు చెందిన ఇద్దరి అనుమానితుల కాల్‌డేటాపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ హత్య తర్వాత ఒంగోలు రేషన్ మాఫియాలో కీలకంగా ఉండే వ్యక్తి కనిపించకుండా పోయాడు. అతడి కాల్‌డేటాలో బాపట్లలో రేషన్ దందా చేసే రైస్‌మిల్ యజమాని నంబరు ఉన్నట్లు పోలీసులు గుర్తించి అతడ్ని అదుపు లోకి తీసుకుని విచారిస్తున్నారని తెలిసింది. బాపట్ల జిల్లాలో రేషన్ మాఫి యా లో కీలకంగా ఉండే వ్యక్తుల కదలికలపై కూడా మంగళవారం రాత్రి నుంచే పోలీ సులు నిఘా పెట్టారు. చీరాలకు చెందిన మరో ఇద్దరిపై కూడా ఖాకీలు గురిపె ట్టినట్లు సమాచారం. హత్యకు సంబంధించి పోలీసులు అనుమానిస్తున్న ఒంగో లుకు చెందిన వ్యక్తిని బాపట్ల రైస్‌మిల్లు యజమాని ప్రకాశం జిల్లా నాగులు ప్పలపాడు మండలం ఉప్పుగుండూరు నుంచి తన వాహనంలో ఎక్కించుకుని బుధవారం ఉదయం తీసుకెళ్లినట్లు పోలీసు దర్యాప్తులో తేలినట్లు సమాచారం. కాల్‌డేటాతో పాటు గడచిన మూడు రోజులుగా వారి లోకేషన్‌లు, బ్యాంకు లావా దేవీలు, వారు తిరిగిన ప్రదేశాలు ఇలా ఏ ఒక్క అంశాన్ని వదలకుండా ఖాకీలు దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒంగోలు రేషన్ మాఫియాతో పాటు బాపట్ల జిల్లాలో దందా చేసే వ్యక్తుల్లో కూడా పోలీసుల దర్యాప్తు వెన్నులో వణుకు పుట్టిస్తోంది.

రైతులకు కొత్త వంగడాలు అందించాలి

- ఎన్‌జీ రంగా వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి

ఏఎన్‌యూ ఇంజనీరింగ్ సెమిస్టర్ ఫలితాల విడుదల

6

మత్స్యకార భరోసా.. 13,800 మందికి

- అర్హుల జాబితాను నేడు కలెక్టర్ ఆమోదంతో ప్రభుత్వానికి పంపనున్న మత్స్యశాఖ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా పట్టాలెక్కుతుండగా వాటి సరసన మత్స్యకార భరోసా కూడా చేరనుంది. వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు ఇచ్చే పరిహారాన్ని రూ.10,000 నుంచి 20,000కు పెంచి ఇవ్వడానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. అర్హులైన ఏ ఒక్క మత్స్యకారుడు భృతికి దూరంగా ఉండడానికి వీల్లేదని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి అనుగుణంగా గడచిన వారం రోజులుగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టిన యంత్రాంగం లబ్ధిదారుల జాబితాను కొలిక్కి తెచ్చింది. జాబితాను కలెక్టర్ వెంకటమురళికి మత్స్యశాఖ అధికారులు గురువారం అందించనున్నారు. ఆయన ఆమోదంతో జాబితాను ప్రభుత్వానికి పంపనున్నారు. ఈ నెల 26న పరిహారాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తామని ప్రభుత్వం గతంలోనే ప్రకటించి ఉండడం, భృతి విషయంలో రెట్టింపు అందనుండడంతో గంగపుత్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. లబ్ధిదారుల సంఖ్యలో గత ప్రభుత్వంలో కన్నా వృద్ధి నమోదైంది. జిల్లా వ్యాప్తంగా దాదాపు 13,800 మందికి మత్స్యకార భరోసాకు అర్హులని తేల్చింది. దీనిని అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

ఏఎన్‌యూ ఇంజనీరింగ్ సెమిస్టర్ ఫలితాల విడుదల

పెదకాకాని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన మొదటి సెమిస్టర్ 4/4 ఫలితాలను వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివప్రసాదరావు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90.12 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 638 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 578 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మే నెల ఒకటవ తేదీ వరకు రీవాల్యుయేషన్‌కి అవకాశం ఇస్తున్నట్లు ఆలపాటి శివప్రసాద రావు తెలియజేశారు. పరీక్ష ఫలితాలను వర్సిటీ అధికారిక వెబ్సైట్ లో పొందుపరిచామని తెలిపారు.

పది ఫెయిల్.. ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి

ఫిరంగిపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ బుధవారం విడుదల చేసిన పదో తరగతి పరీక్షల ఫలితాల్లో ఫిరంగిపురం గ్రామానికి చెందిన పసల వినయ్ కుమార్(16) అనే విద్యార్థి ఫెయిల్ అయ్యాడు. లెక్కల సబ్జెక్టులో తప్పినట్లు తెలుసుకున్న వినయ్‌కుమార్ ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. చుట్టు పక్కల వారు గమనించి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకు వెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తండ్రి జీవన్‌దాసు కార్పెంటర్ వృత్తి చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. విద్యార్థికి తల్లి నక్షత్రం, చెల్లి తేజ ఉన్నారు.

1,29,798 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,22,419 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,29,798 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 58,020 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			తేజ	10000	13500
334	9500	13000	షార్క్-1	10000	12000
నంబరు.5	10000	12500	బ్యాడిగి 355	10000	13000
273	10000	12400	సింజెంటా		
341	10000	13000	బ్యాడిగి 5531	–	–
4884	10000	11300	దేవనూరుడీలక్స్	10000	12400
సూపర్10	10000	12600	ఆర్మూరు	9800	11000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			తాలుకాయలు	4500	6500

పది ఫలితాల్లో గురుకుల విద్యార్థుల సత్తా

● నూరుశాతం ఫలితాలతో యద్దనపూడి పాఠశాల ప్రథమస్థానం

గుంటూరు(విద్య),ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలోని గురుకుల పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారని కోఆర్డినేటర్ పద్మజ వెల్లడించారు. బాపట్ల జిల్లాలోని యద్దనపూడి గురుకుల పాఠశాలలో నూరుశాతం ఫలితాలు నమోదు అయ్యాయని, ఇక్కడ నుంచి మొత్తం 76 మంది పరీక్షకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. అదేవిధంగా కాకుమాను గురుకుల పాఠశాల 98.65శాతం, తాడికొండ 87.1, అడవితక్కెళ్ళపాడు 78.57, కారంపూడి 88.89, రామకృష్ణాపురం 81.25, అచ్చంపేట 88.89, వీపీసౌత్ 91.84, ఉప్పలపాడు 81.01, అమరావతి 89.56, వినుకొండ 93.51, గురజాల 75.81, యడ్లపాడు 77.78, సత్తెనపల్లి 88.89, బాపట్ల 96, నిజాంపట్నం 87.04, రేపల్లె 88.64, చుండూరు 76.12, నరసాయపాలెం 82.14, నాగులపాలెం 92.13, నార్త్ అద్దంకి 90.66శాతం ఫలితాలు సాధించారని వెల్లడించారు.

సత్తాచాటిన బీసీ హాస్టల్స్ విద్యార్థులు

బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మొత్తం 12 హాస్టల్స్ నుంచి 123 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకాగా వారిలో 113 మంది ఉత్తీర్ణులయ్యారని బీసీ సంక్షేమశాఖాధికారి కే మయూరి వెల్లడించారు. ఇందులో 76 మంది ప్రథమశ్రేణిలో, 25 మంది ద్వితీయ శ్రేణిలో, 12 మంది తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులు అయినట్లు వివరించారు. జిల్లా ఉత్తీర్ణత 88.53శాతం కాగా బీసీ హాస్టల్స్‌లో 91.87శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. తమ హాస్టల్స్‌లో 8 మంది హాస్టల్ విద్యార్థులు 500పైగా మారులు సాధించగా వీరిలో చల్లా శివశేఖర్ 544(పెనుమాక), జీ జగదీష్ 535(ఫిరంగిపురం), పీ శాంతిశ్రీ 532(తాడికొండ), దాసూరి సాయిరామ్ 526(తెనాలి), వీవి ఇందు 516(తాడికొండ) మార్కులు సాధించారని వెల్లడించారు.

జిల్లాలోని 14 సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్స్ నుంచి 97 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా వారిలో 85 మంది (88శాతం) ఉత్తీర్ణత సాధించారని సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి డీడీ రాజాడెబోరా వెల్లడించారు. ఉత్తీర్ణులైనవారిలో ప్రథమశ్రేణిలో 58మంది, ద్వితీయ శ్రేణిలో 19మంది, తృతీయ శ్రేణిలో 8 మంది ఉన్నారని తెలిపారు. ఇందులో ఏ రిత్విక(మంగళగిరి) 539 మార్కులు, ముట్లూరి యశ్వంత్(పెదనందిపాడు) 528 మార్కులు, శీలం రేష్మా (రాజాగారి తోట,గుంటూరు) 526 మార్కులు, సొపాటి సతీష్ (మునిపల్లె) 525 మార్కులు, బీ ప్రసాద్(బృందావన్‌గార్డెన్,గుంటూరు)515 మార్కులు, కే కావ్య(దుగ్గిరాల) 506 మార్కులు, సుమశ్రీ(పొన్నూరు) 502 మార్కులు సాధించినట్లు డీడీ రాజాడెబోరా తెలిపారు.

● జిల్లాలోని గిరిజన సంక్షేమశాఖ హాస్టల్స్ నుంచి 27 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకాగా వారిలో 21 మంది (77.77 శాతం) ఉత్తీర్ణులయ్యారని గిరిజన సంక్షేమశాఖాధికారి మురళి వెల్లడించారు. గురుకుల పాఠశాలల నుంచి 60 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 36 మంది(65.56శాతం) ఉత్తీర్ణత సాధించారు.

రైతులకు కొత్త వంగడాలు అందించాలి

● ఎన్‌జీ రంగా వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ శారదా జయలక్ష్మీ దేవి

లాంఫాం(తాడికొండ)ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రైతుల సూచనలు, సలహాలను దృష్టిలో ఉంచుకుని కొత్త వంగడాలపై సరైన ఫీడ్ బ్యాక్ రైతులకు అందించాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. లాంఫాంలోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రెండు రోజుల పాటు కృష్ణా మండలం వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. బుధవారం జరిగిన సమావేశానికి పరిశోధనా సంచాలకులు డాక్టర్ పీవీ సత్యన్నారాయణ అధ్యక్షత వహించారు. ముందుగా లాంఫాం ఏడీఆర్ దుర్గా ప్రసాద్ గత సంవత్సరం జరిగిన పరిశోధనా ప్రగతిని పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వీసీ శారదా జయలక్ష్మీదేవి మాట్లాడుతూ సహజ వనరుల పొదుపు, నేల ఆరోగ్యం వంటి పలు అంశాలను పరిగణలోకి తీసుకోవాలని తెలిపారు. వైవిధ్యమైన పంటల సరళి, అత్యధిక పరిశోధన, విస్తరణ కేంద్రాలు గల కృష్ణా మండలంలో నిష్ణాతులైన రైతుల ద్వారా సాగు సమస్యలు, సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జీ శివనారాయణ మాట్లాడుతూ జిల్లా వనరులు, అవసరాలు, పరిస్థితులు దృష్టిలో ఉంచుకొని పరిశోధనలు జరగాలన్నారు. వివిధ జిల్లాల వ్యవసాయ అధికారులు అక్కడి పంటల స్థితిగతులు, పంటల సమస్యలు, మినీకిట్ల పనితీరు తెలియజేస్తూ రానున్న సంవత్సరంలో చేపట్టవలసిన పరిశోధనలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం రైతులకు ఉపయోగపడే కేవీకే ఘంటశాల, కేవీకే గరికపాడు వారు పలు ప్రచురణలు విడుదల చేశారు. కార్యక్రమంలో ఆరు జిల్లాల జిల్లా వ్యవసాయ అధికారులు, 12 పరిశోధన స్థానాలు, ఆరు విస్తరణ యూనిట్ల శాస్త్రవేత్తలు, వివిధ పంటల ప్రధాన శాస్త్రవేత్తలు, డీఆర్‌ఎస్ అధికారులు, ఆరు జిల్లాల నుంచి అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ను ఢీకొన్న కంటెయినర్

క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్

చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలింపు

చిలకలూరిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట కొత్త బైపాస్ రోడ్డుపై బుధవారం పురుషోత్తమ పట్నం ఫ్లైవోవర్‌కు సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఖాళీ కంటెయినర్ లారీ క్యాబిన్‌లో తమిళనాడుకు చెందిన డ్రైవర్ ఎన్ మురుగన్ (54) ఇరుక్కుపోయి స్పృహ కోల్పోయాడు. నిద్రమత్తులో ఇతడు రోడ్డు పక్కన డివైడర్ పై ఉన్న మొక్కలకు నీరు పెడుతున్న



క్యాబిన్లో ఇరుక్కుపోయిన డ్రైవర్ మురుగన్

డ్రైవర్‌ను రక్షించేందుకు క్యాబిన్ కట్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మరొక ట్యాంకర్ లారీని ఢీకొట్టాడు. దీంతో ఇతడి లారీ క్యాబిన్ పూర్తిగా ధ్వంసమై లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. సమాచారం అందుకున్న చిలకలూరిపేట అర్బన్ పోలీసులు, అగ్నిమాపక దళ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. అర్బన్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో హైవే పై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. ఫైర్ ఆఫీసర్ ఎన్ కిరణ్ కుమార్ రెడ్డి, ఎల్ఎఫ్ వెంకయ్య, అగ్ని మాపక సిబ్బంది లారీ క్యాబిన్ కట్ చేసి డ్రైవర్ మురుగన్‌ను రక్షించారు. తీవ్రంగా గాయపడిన అతడిని 108 వాహనంలో తక్షణ వైద్యచికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పశువైద్య సేవలను మరింత చేరువ చేస్తాం

డాక్టర్ సాంబశివరావు

పశుసంవర్ధక శాఖ జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక

గుంటూరు సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ కే సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అసోసియేషన్ ఎన్నిక బుధవారం గుంటూరులో నిర్వహించారు.



పశుసంవర్ధక శాఖ ఆఫీసర్స్ సర్వీస్ అసోసియేషన్ ను అభినందిస్తున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి నరసింహారావు తదితరులు

రాష్ట్ర పశువైద్యాధికారుల సంఘం అధ్యక్షులు డాక్టర్ కల్లూరి సత్యనారాయణ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఉపాధ్యక్షుడిగా డాక్టర్ ఎం నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా డాక్టర్ కేవీ జనార్ధనరావు, ట్రెజరర్‌గా డాక్టర్ ఏ మురళీకృష్ణ, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ ఎస్ కళావతి ఎన్నికయ్యారు .కొత్తగా ఎన్నికైన వారికి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి ఓ నరసింహారావు అభినందనలు తెలిపారు .జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ కే సాంబశివరావు మాట్లాడుతూ పశువైద్య సేవలను మరింత చేరువ చేస్తామని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ జిల్లాని ప్రగతి పథంలో ఉంచుతామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సర్జన్ లక్కింశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిపై వర్సిటీలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ

పెదకాకాని, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రవాదుల మారణహోమంలో 27 మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఏబీవీపీ నాయకులు తెలిపారు. బుధవారం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏఎన్‌యూ శాఖ ఆధ్వర్యంలో బాధితులకు కొవ్వొత్తుల ర్యాలీతో నివాళులర్పించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు, పరిశోధకులు పాల్గొని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యతను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో రామకాంత్, మోహన్ రావు, గంగాధర్, శివ గణేష్ పాల్గొన్నారు.

ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

◆ వైద్యులు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం

◆ డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి తగిన చర్యలు చేపట్టాలని సూచన

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం మండల కేంద్రం భట్టిప్రోలులో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో రికార్డులను ఎమ్మెల్యే పరిశీలించారు. పట్టికలో హాజరు వేసిన వైద్యులు అక్కడ అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు సరైన సేవలు అందడం లేదని తన దృష్టికి వచ్చినట్లుగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆకస్మిక తనిఖీల్లో కూడా అదే తేటతెల్లం అయ్యిందని మండిపడ్డారు. ఈ విషయంపై డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి ఆరోగ్య కేంద్రం స్థితిగతులు సక్రమంగా లేవని, రోగులకు అందుబాటులో వైద్యులు ఉండటం లేదన్నారు. వెంటనే ఆరోగ్య కేంద్రంపై దృష్టి సారించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అన్నక్యాంటీన్ స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. తొలుత టీడీపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి కార్యాలయంలో కార్యకర్తలతో ముచ్చటించారు. వైద్య కేంద్రం తనిఖీలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్‌డి ఉషారాణి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

విద్యాజ్యోతితో జడ్పీల్లో ఉత్తమ ఫలితాలు

జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా

గుంటూరు సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పరిధిలోని పాఠశాలల్లో ఈ సంవత్సరం పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు జడ్పీ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా అన్నారు. జడ్పీ ద్వారా సరఫరా చేసిన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ వల్లే ఇటువంటి ఫలితాలు సాధ్యం అయ్యాయన్నారు. బుధవారం పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదలైన తర్వాత జడ్పీ ఛైర్‌పర్సన్ పల్నాడు జిల్లా కారంపూడి మండలం ఒప్పిచర్ల పాఠశాలకు చెందిన అంగటి పావని చంద్రికకు ఫోన్‌చేసి అభినందించారు. మొత్తం 600 మార్కులకు గాను 598 మార్కులు సాధించటం వల్ల పావని ప్రభుత్వ పాఠశాలల గౌరవం నిలబెట్టారని, ప్రధానోపాధ్యాయురాలు లలిత కుమారి కూడా చాలా కష్టపడ్డారని అన్నారు. గుంటూరు జిల్లా 88.53%, పల్నాడు జిల్లా 84.15%,బాపట్ల జిల్లాలో 83.96% మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని జడ్పీ ఛైర్ పర్సన్ పేర్కొన్నారు.

నిరంతర సాధనతోనే మెరుగైన ఫలితాలు

● భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ

గుంటూరు (విద్య) ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తామని, ఇందుకు ఉపాధ్యాయని నిరంతర కృషి తోడు కావడంతో మెరుగైన ఫలితాలు సాధ్యమౌతున్నాయని భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. బుధవారం చంద్రమౌళి



విద్యార్థులను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

నగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన పదో తరగతి ఫలితాలలో రాష్ట్రంలో తమ విద్యార్థులు అగ్రస్థానంలో నిలిచాయని తెలిపారు. భాష్యం విద్యార్థి వై నేహాంజని 600కి 600 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలిచినట్లు తెలిపారు. అదేవిధంగా కె.ప్రేమ సత్య లిఖిత 599, కె.హర్షిత్ 599, ఎ. లిఖిత 599, పి.వి.ఎస్.ఎస్.శ్రీహాసిని 598, ఎస్. షాలిని సంహిత 598 మార్కులు, ఎం.ప్రియజోషిని 598 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. గణితంలో 100కు 100 సాధించిన విద్యార్థులు 1088 మంది, సైన్స్ లో 100కు 100 సాధించిన వారు 724 మంది ఉన్నట్లు తెలిపారు. భాష్యం విద్యాసంస్థలు సాధించిన విజయానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం, సంస్థలపై ఉన్న నమ్మకమే కారణమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు అభినందించారు.

పది ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య),ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని ఛైర్మన్ ఫ్రాన్సిస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ విద్యార్థులు 597 మార్కులు సాధించినట్లు వివరించారు. 590 పైన 9 మంది, 580 పైన 65 మంది, 570 పైన 130



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

మంది, 560 పైన 213 మంది, 550 పైన 281 మంది, 540 మార్కులపైన 351 మంది సాధించారన్నారు. తమ పాఠశాలలో 77 మందికి గణితంలో 100మార్కులు, తెలుగులో 40 మందికి 100 మార్కులు వచ్చినట్లు వివరించారు. ఇంకా సోషల్లో 52 మందికి 100 మార్కులు,సైన్స్‌లో 42 మందికి 100 మార్కులు, హిందీలో 100 మందికి 95 పైన మార్కులు వచ్చాయని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ డాక్టర్ ఫ్రాన్సిస్ రెడ్డి, వైస్ ఛైర్మన్ ఆరోన్‌రెడ్డి, డైరెక్టర్స్ విజయభాస్కర్ రెడి, జోసఫ్ రెడ్డి, ప్రిన్సిపాల్ అమీనా బేగం, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి తదితరులు అభినందించారు.

గుంటూరు మీదగా చర్లపల్లి, విశాఖపట్టణంలకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, విశాఖపట్టణంలకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 08579 విశాఖపట్టణం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 25 నుంచి మే 30వ తేదీ వరకు ప్రతీ శుక్రవారం సాయంత్రం 5.30కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2 గంటలకు గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 7.20 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 08580 చర్లపల్లి - విశాఖపట్టణం ప్రత్యేక రైలు ఈ నెల 26 నుంచి మే 31 వరకు ప్రతీ శనివారం రాత్రి 7 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి మీదగా రాత్రి 10.40కి గుంటూరు, ఉదయం 8 గంటలకు విశాఖపట్టణం చేరుకొంటుందని సీపీఆర్‌వో తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 514.60 అడుగులు ఉంది. ఇది 139.61 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ ద్వారా 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1350 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



కూటమి నాయకులతో కలిసి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పెహల్గాం మృతులకు నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పెహల్గాంలో ఉగ్రవాదుల దాడితో మృతి చెందిన వారికి నివాళులు అర్పిస్తూ కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ బుధవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. బాపట్ల అంబేద్కర్ సర్కిల్ దగ్గర నుంచి పాతబస్టాండ్ వరకు నిర్వహించిన ఈప్రదర్శనలో ఆయన మాట్లాడుతూ ఇలాంటి దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ప్రశాంతంగా ఉన్న భారతదేశాన్ని అల్లకల్లోలం చేసి విచ్ఛిన్నం చేయాలనే దురుద్దేశ్యంతో ఉగ్రవాదులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. తప్పకుండా దీనికి ప్రతిచర్యలు ఉంటాయన్నారు. దాడిలో మృతి చెందిన కుటుంబాలకు సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు తెలుగుదేశం పార్టీ నాయకులు పల్లం సరోజనీ, జి.గిరిజారాణి, కూచిపూడి ఝాన్సీరాణి, మందపాటి ఆంద్రేయ, బీజేపీనాయకులు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, జీవీఎల్‌మోహన్‌గౌడ్, బంర్రెడ్డి రజనీ, బి.రత్తయ్య, చేజర్ల సతీష్, శీలం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైసీపీ ఆధ్వర్యంలో...

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పెహల్గాన్ టెర్రరిస్టుల దుశ్చర్యను ఖండిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తులతో స్థానిక రథంబజారులోని వైసీపీ కార్యాలయం దగ్గర నుంచి పురవీధులలో ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదేశాల మేరకు ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ దాడిలో మృతి చెందిన వారికి నివాళులు అర్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పట్టణ, మండలాధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఏడుకొండలురెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కొక్కిలిగడ్డ చెంచయ్య, సహిత్, పాపారావు, జోగి రాజా పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడి దారుణం : తాంద్ర

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జమ్ముకాశ్మీర్‌లోని అనంతనాగ్ జిల్లా పెహల్గాంలో ఉగ్రవాదుల దాడి దారుణమని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు తెలిపారు. ఈ విషయమై బుధవారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్‌లో అల్లకల్లోలం చేసి దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనే దురుద్దేశ్యంతోనే ఉగ్రవాదులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. ఈ విధంగా పాశవికంగా కాల్పులు జరపటం దుర్మార్గమన్నారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు పుట్టా ఆదిశేషారెడ్డి, సీహెచ్‌వీ కృష్ణారావు పాల్గొన్నారు.

మృతులకు జడ్పీటీసీ, ఎంపీటీసీల నివాళి

కర్లపాలెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదులు అమాయకుల ప్రాణాలు తీయటాన్ని జడ్పీటీసీ పిట్ల వేణుగోపాలరెడ్డి, ఎంపీటీసీ, రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాంద్ర సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉగ్రవాదులది పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దాడిని ఖండించిన ఆపస్ నాయకులు

వేమూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో విహార యాత్రికులపై జరిగిన ఉగ్రవాద దాడిని ఏపీ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఖండించారు. బుధవారం వేమూరులో బాపట్ల జిల్లా ఆపస్ అధ్యక్షులు శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ, విహార యాత్రికులపై జరిపిన దాడి అమానవీయమైనదన్నారు. ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుందుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, మతం పేరుతో జరుగుతున్న హత్యలు మానవాళి చరిత్రకు మాయని మచ్చ అన్నారు. మృతులకు నివాళులర్పిస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వీరయ్యచౌదరి మృతికి ఎంపీ, ఎమ్మెల్యే సంతాపం

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధికార ప్రతినిధి, సీనియర్ నాయకుడు ముప్పవరపు వీరయ్యచౌదరిని అత్యంత దారుణంగా హత్య చేయటం దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటు అన్నారు. వీరయ్యచౌదరి మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని, హత్యకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి మానం విజేత ఆయన మృతికి సంతాపం ప్రకటించారు.

పుస్తకాలు మన నేస్తాలు : కమిషనర్

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పుస్తకాలు మన ఆలోచన పరిధిని విస్తృతం చేసే నేస్తాలని మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి అన్నారు. బాపట్ల శాఖా గ్రంథాలయంలో బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ప్రదర్శనను కమిషనర్ ప్రారంభించి మాట్లాడుతూ మన జీవితాలలో వెలుగులు నింపి పుస్తకాలు మనకు దారిచూపుతాయన్నారు. పుస్తక పఠనం మనిషి మానవీయ కోణాన్ని పెంచుతుందన్నారు. సంపూర్ణమైన జీవనాన్ని గడపటానికి దోహదపడుతుందన్నారు. పుస్తకాలు మనల్ని తెలియని లోకాలకు తీసుకెళతాయని వివరించారు. కార్యక్రమంలో భావపురి పుస్తకోద్యమ సమితి, శాఖా గ్రంథాలయాధికారులు ఎ.శివాజిగణేశన్, డాక్టర్ పీసీ సాయిబాబు, జి.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహారావు పాల్గొన్నారు.



ప్రదర్శనలో పుస్తకాలను పరిశీలిస్తున్న కమిషనర్, విద్యార్థులు తదితరులు

మానవ ప్రగతికి పుస్తకం ఎంతో ముఖ్యం : రావూరి

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మానవ ప్రగతికి పుస్తకం ఎంతో ముఖ్యమని, పుస్తక పఠనాసక్తిని పెంచుకోవటం వల్ల జ్ఞానం పెంపొందుతుందని సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. ప్రపంచ పుస్తక దినోత్సవ కార్యక్రమంలో బుధవారం సాహితిభారతి ఉపాధ్యక్షులు ఆదంషఫి, డాక్టర్ శ్రీనివాస్, సాహితిభారతి సభ్యులు దగ్గుమల్లి శామ్యూల్ మాట్లాడుతూ పుస్తకం అత్యంత విలువైన వస్తువని అన్నారు. ఈ కార్యక్రమంలో కామరాజు కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు చేయాలి

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ సీపీఐ బృందంతో కలిసి బుధవారం మూలపాలెం, నరసాయపాలెం, కంకటపాలెం పరిసర గ్రామాలలో పర్యటించారు. కౌలు రైతులు ధాన్యం అమ్ముకోవటంలో ఎదురౌతున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఖరీఫ్, లేట్‌ఖరీఫ్, రబీసీజన్‌లో కలిపి లక్షా80వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు.

మార్కులు తక్కువ వచ్చాయని వెళ్ళిపోయిన విద్యార్థి

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షలలో తన స్నేహితుల కన్న తక్కువ మార్కులు వచ్చాయని కలత చెంది ఓ విద్యార్థి ఇంటి నుంచి వెళ్ళిపోయాడు. చినగంజాంకు చెందిన నల్లమోతు శ్రీనివాసరెడ్డి కుటుంబం బాపట్ల టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆయన కుమారుడికి 10వ తరగతిలో 406మార్కులు వచ్చాయి. అయితే తన స్నేహితుల కన్న తక్కువ మార్కులు వచ్చాయని ఇంట్లో నుంచి వెళ్ళిపోయి తిరిగి రాకపోవటంతో శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసుస్టేషన్ రైటర్ షేక్.కరీముల్లా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిరుపేదల అభివృద్ధిపై అవగాహన కల్పించాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు జీవనోపాధి కల్పించటం, వారి భవిష్యత్తు అభివృద్ధిపై ప్రణాళికతో అవగాహన కల్పించటం చాలా ముఖ్యమని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తెచ్చేలా మార్గదర్శకులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ చెప్పారు. పి4 అమలు తీరుపై జిల్లా, మండల ప్రత్యేకాధికారులు, మండలస్థాయి అధికారులతో బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 62,291 బంగారు కుటుంబాలు ఉన్నాయన్నారు. ఆ కుటుంబాలన్ని పేదరికం నుంచి బయటకు రావటానికి చేయూతనందించాలన్నారు. పి4 విధివిధానాలు అమలు కొరకు జిల్లా, మండల, గ్రామస్థాయిలో కమిటీలు నియమిస్తామన్నారు. ఆర్థిక, సామాజిక రంగాలలో పేద కుటుంబాలు ఎదగటమే రాష్ట్రప్రభుత్వ ముఖ్య లక్ష్యమన్నారు. ఒక్కొక్క మండలంలో సుమారు 500 బంగారు కుటుంబాలు ఉండగా ఆ కుటుంబాలలోని యువతకు నైపుణ్యాల అభివృద్ధిపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు, గ్రామస్థాయి అధికారులకు వీటిపై ఓరియంటేషన్ నిర్వహించాలన్నారు.

పెన్షన్‌ల నగదు పక్కదారిపడితే క్రిమినల్ చర్యలు

ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల నగదు పక్కదారి పడితే బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పింఛన్ నగదు పంపిణీ ప్రక్రియ ముగిసిన తక్షణమే మిగిలిన నగదును ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందన్నారు. సంతమాగులూరు మండలంలో రూ.6.41 లక్షల పింఛన్ నగదు ఎందుకు చెల్లించలేదని నిలదీశారు. అలాగే బాపట్ల, బల్లికురవ, మార్టూరు, వేటపాలెం, నిజాంపట్నం మండలాలలో నగదు పక్కదారిపడితే బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సంబంధితాధికారులను ప్రశ్నించారు? తక్షణమే సస్పెండ్ చేయాలని, వారిపై కేసు పెట్టి ఎఫ్ఐఆర్ నమోదుతో ఛార్జీషీట్ పంపాలని తెలిపారు. తక్షణమే సంబంధిత మండలాల నుంచి నివేదిక పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్‌గౌడ్, సీపీవో కె.శ్రీనివాసరావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలి

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలను సరఫరా చేసే వారిపై పీడీ యాక్ట్ కేసులు పెట్టాలని చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి తీసుకునే వారి వివరాలు సేకరించాలని ఆయన అధికారులకు చెప్పారు. ప్రజలు నుంచి సమాచారం సేకరించి గంజాయి సరఫరా చేసే వారిని పట్టుకోవాలన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు మండలస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామస్థాయిలో గంజాయి వినియోగించేవారి వివరాలను సచివాలయ సిబ్బంది ద్వారా సేకరించాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1972 టోల్‌ఫ్రీనెంబర్‌కు సమాచారం, ఫిర్యాదులు చేయవచ్చు అని చెప్పారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. జిల్లాలో 4 లక్షల కుటుంబాల ప్రజలకు గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించేవిధంగా వాల్‌పోస్టర్‌లు, కరపత్రాలను ప్రచురించి పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ టీపీ విఠలేశ్వర్, సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారిణి జె.రాజాదెబోరా, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, జిల్లా రవాణాశాఖాధికారి పరందామరెడ్డి, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాలలో జిల్లా విద్యార్థుల ప్రతిభ

● విశ్వశాంతి విద్యార్థుల విజయదుందుభి



బ్లెస్సీ మేఘన జి.లక్ష్మీనమ్రత శైష్ట

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో విశ్వశాంతి విద్యార్థులు విజయదుందుభి మోగించారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో భట్టిప్రోలు విశ్వశాంతి విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. గోగినేని బ్లెస్సీ మేఘన 594, గురిగెశెట్టి లక్ష్మీనమ్రత 591, ఎండి శైష్ట 590 లు సాధించి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. 500లకు పైగా మార్కులను 83 మంది విద్యార్థులు సాధించగా, మొత్తం విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో ఉత్తీర్ణులైనట్లు యాజమాన్యం తెలిపింది.

సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో..

సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. వేల్పూరి శేషసాయి 589, సానియానూరా 588, డొక్కు నాగభవాని 586 మార్కులు సాధించారు. మొత్తం 26 మంది విద్యార్థులు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణులైనట్లు తెలిపారు.



వేణువర్ధన్

● కొల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో సాయివాసవీ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు. గొల్లపూడి వేణువర్ధన్ 592 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు డైరెక్టర్ ఉప్పు శ్రీనివాసరావు తెలిపారు. చిలుమూరు సింధూ 587 మార్కులు సాధించగా, జొన్నకూటి మేఘన 585 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు.

● పదో తరగతి పరీక్ష ఫలితాల్లో వివేకా విద్యార్థులు విజయకేతనం ఎగుర వేశారు. కొల్లూరు వివేకా ఉన్నత పాఠశాలలో ఉప్పు జోషిత 590 మార్కులు, మండవ ఆస్మిత 589, గాజుల మహాలక్ష్మి 587, వరికూటి డిష్యంత్ 583 మార్కులు సాధించినట్లు డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ తెలిపారు. 550కి పైగా మార్కులు 10 మంది విద్యార్థులు, 500లకు పైబడి 26 మంది విద్యార్థులు మార్కులు సాధించారని వారందరిని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు గుత్తా వెంకటరత్నం, కె.రామరాజు, డీన్ రత్నకుమారి, ప్రిన్సిపల్ రమేష్ అభినందించారు.

● చైతన్య విద్యావిహార విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించారు. వి.తేజస్విని 588, ఎ.స్వరూప 588, కె.వరుణ్ 588 మార్కులు సాధించినట్లు సంస్థ డైరెక్టర్ పావులూరి వెంకటేశ్వరరావు తెలిపారు. 57 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 56 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో....

భట్టిప్రోలు, కొల్లూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : భట్టిప్రోలు మండలం పెసర్లంక డికె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో త్రిపురనేని సుహిత 594 మార్కులు సాధించి కొల్లూరు, భట్టిప్రోలులోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించింది. కొల్లూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థి గరికపాటి అలేఖ్య 589 మార్కులు సాధించి పాఠశాలల్లో ప్రథమ స్థానం సాధించింది. బాలురోన్నత పాఠశాల విద్యార్థి శనివరపు సాయిసూర్య 588 మార్కులు సాధించి ఆ పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచాడు.


చందోలు విద్యార్థి మండలంలో ప్రథమస్థానం



అబ్దుల్ రహమాన్ పవన్‌కుమార్‌రెడ్డి

పిట్టలవానిపాలెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందోలు నీలిబంగారయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అబ్దుల్ రహమాన్ పది ఫలితాలలో 600 కు 577 మార్కులతో మండల స్థాయిలో ప్రథమస్థానం సాధించాడు. అదేపాఠశాలకు చెందిన విద్యార్థి కుంచాల పవన్‌కుమార్‌రెడ్డి 571 మార్కులతో రెండోస్థానంలో నిలిచాడు. ఖాజీపాలెం, అల్లూరు, పిట్టలవానిపాలేనికి చెందిన విద్యార్థిని, విద్యార్థులు పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారని మండల విద్యాశాఖాధికారి-2 రాజారత్నం తెలిపారు.

రేపల్లెలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ప్రతిభ



ఎన్.తేజస్విని పూర్ణసుధాకర్, వి.షణ్ముఖ

రేపల్లె, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ప్రతిభకనబరిచారు. పట్టణంలోని 3వ వార్డులోని మున్సిపల్ ఉన్నతపాఠశాల 10వ తరగతి విద్యార్థిని ఎన్.తేజస్విని 590 మార్కులు సాధించగా అదే పాఠశాలకు చెందిన లీలాభరత్‌కుమార్ 584 మార్కులు సాధించారు. మండలంలోని పేటేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గూడపాటి పూర్ణసుధాకర్ 588 మార్కులు, వి.షణ్ముఖ, దుర్గారావు 570 మార్కులు సాధించి ప్రతిభకనబరిచారు. మండలంలోని పిరాట్లంక జడ్పీ ఉన్నత పాఠశాలలో నూటికినూరుశాతం ఫలితాలుసాధించారు.

మండలంలో గూడవల్లి విద్యార్థిని ప్రథమస్థానం

చెరుకుపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండలం గూడవల్లి పంచాయతీ పరిధిలోని దాసరిపాలెంకు చెందిన సిహెచ్ లక్ష్మీప్రియ 582మార్కులతో మండలస్థాయిలో ప్రథమర్యాంకు సాధించింది. ఐఐటిలో సీటుసాధించి ఉన్నతస్థానం సంపాదించి తన తల్లిదండ్రుల కలను నెరవేర్చడమే తన లక్ష్యమని లక్ష్మీప్రియ తెలిపింది. ఆమె తండ్రి ఆటోడ్రైవర్‌గా చేస్తున్నాడు. ఆమె సాధించిన విజయం పట్ల స్కూల్ యాజమాన్యం, గ్రామస్తులు, లక్ష్మీప్రియను అభినందించారు.

వేమూరు మండలంలో ప్రథమ స్థానంలో పెరవలి విద్యార్థిని



కంచి సుభాషిణి

వేమూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వేమూరు మండల పరిధిలోని 6 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన పదవ తరగతి ఫలితాల్లో 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. 220 మంది పరీక్షలకు హాజరు కాగా 150 మంది ఉత్తీర్ణత పొందారు. 120 మంది బాలికలలో 87 మంది 72 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురు 100 మందిలో 71 మంది ఉత్తీర్ణులయ్యారు. పెరవలి పాఠశాలకు చెందిన కంచి సుభాషిణి 589 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. చావలి పాఠశాలకు చెందిన దివ్య 587 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. కుచ్చెళ్లపాడుకు చెందిన జగన్‌మయిశ్రీ 564 మార్కులతో తృతీయ స్థానం, జంపనికి చెందిన షేక్ హస్మత్ 555 మార్కులతో నాల్గవ స్థానం, వేమూరుకు చెందిన అక్షయ 444 మార్కులతో ఐదవ స్థానం, వరహాపురం గ్రామానికి చెందిన పూజిత 406 మార్కులతో మండల స్థాయిలో ఆరవ స్థానం దక్కించుకున్నారు.

పెసర్లంక జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల విజయకేతనం

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల పరిధిలోని పెసర్లంక డీకే జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు విజయకేతనం ఎగుర వేశారు. 64 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 62 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. త్రిపురనేని సుహిత 590 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. గాజులేటి మోహిత 588, మోర్ల భవ్యశ్రీ 587, బోరుగడ్డ సన్ని 584, గురిందపల్లి స్వాతి 582, ఈపూరు లాస్య 580 మార్కులు సాధించారన్నారు. మొత్తం 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు హెచ్‌ఎం తెలిపారు.

పదో తరగతిలో మండల ఉత్తీర్ణత 73 శాతం




చేబ్రోలు చైతన్యశ్రీ

అమృతలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో అమృతలూరు మండలం 73 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ అధికారి రమేష్‌బాబు బుధవారం తెలిపారు. మండల టాపర్‌గా మోపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి చేబ్రోలు చైతన్యశ్రీ 585 మార్కులు సాధించింది. రెండో స్థానంలో పెదపూడి హైస్కూల్ విద్యార్థిని సౌజన్య 577, అమృతలూరు హైస్కూల్ విద్యార్థిని సృజని 570 మార్కులతో మూడో స్థానం సాధించారు.

హైవెండ్ విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత

కర్లపాలెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో పదో తరగతి పరీక్షలలో కర్లపాలెం హైవెండ్ హైస్కూల్ నూరుశాతం ఫలితాలు సాధించిందని ఎంఈవో విజయశ్రీ తెలిపారు. మండలంలో వరుసగా మూడు సంవత్సరాలు పది పరీక్షలలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించటంపై ఎంఈవో విజయశ్రీ విద్యార్థులను, పాఠశాల యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందించారు. కావూరి తేజస్విని 569, బత్తుల యమున 565, కోసన బేబి వెంకట కార్తీక్ 564, ఏనుగు సుస్మిత 560 మార్కులు సాధించి పాఠశాలలో అగ్రగామిగా నిలిచారు. హైవెండ్ హైస్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ సాయిమహేంద్రబాబు, డైరెక్టర్‌లు ఆంజనేయప్రసాద్, చాంధిని, వెంకటజ్యోతిలు విద్యార్థులతో కలిసి కర్లపాలెం సెంటర్‌లో బాణా సంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని చైర్మన్ ఉదయచంద్రరావు పర్యవేక్షించారు.



కర్లపాలెం సెంటర్‌లో పదిపరీక్షలలో విజయకేతనం చూపిస్తున్న హైవెండ్ విద్యార్థులు, యాజమాన్యం

కూల్‌డ్రింక్స్ దుకాణంలో ఫుడ్‌సేఫ్టీ అధికారి తనిఖీ

బాపట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్‌ను విక్రయిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఫుడ్‌సేఫ్టీ జిల్లా అధికారి దేవరాజు తనిఖీలు చేపట్టారు. ఓల్డ్‌షరాఫ్‌బజారులో వినీలా ఎంటర్‌ప్రైజెస్‌లో కూల్‌డ్రింక్స్‌ను పరిశీలించి శాంపిల్స్ సేకరించారు. అదేవిధంగా గోదాంలో ఉన్న స్టాక్‌ను కూడా ఆయన తనిఖీ చేశారు.

కాలేజీకి వెళ్ళిన విద్యార్థి తిరిగిరాలేదంటూ ఫిర్యాదు

బాపట్ల,ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శృంగారపురంనకు చెందిన గొలకారం చరణ్‌రాజు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్నాడు. ఈనెల 21వ తేదీన కళాశాలకు వెళ్ళిన కుమారుడు తిరిగి రాకపోవటంతో చుట్టుపక్కల విచారించి తల్లి వీరమణి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ చంద్రావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వెల్లటూరు వద్ద అండర్ టన్నెల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

వెల్లటూరు అండర్ టన్నెల్ నిర్మాణానికి శంకుస్థాపన

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వెల్లటూరు చానల్ సర్‌ప్లస్ అండర్ టన్నెల్ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శంకుస్థాపన చేశారు. భట్టిప్రోలు వద్ద వెల్లటూరు చానల్ అండర్ టన్నెల్ నిర్మాణం రూ.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరితగతిన అండర్ టన్నెల్ నిర్మాణం జరగకపోతే రాబోయే ఖరీఫ్‌లో రెండు నియోజకవర్గాల్లోని రైతులు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటారని మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో తాను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, స్పందించిన ఆయన సాగునీటి పారుదల శాఖ మంత్రితో టన్నెల్ నిర్మాణం మంజూరు చేయించడం జరిగిందని, ఆర్థిక శాఖ మంత్రి కూడా నిధులు వెంటనే విడుదల చేశారని, ఇందుకు వారందరికి ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం రబీలో ఉన్న పంటకు నష్టం జరగకుండా మళ్లీ సీజన్ ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే గుత్తేదారుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, ఎస్ఈ వెంకటరత్నం, డ్రైనేజీ డీఈ దీనదయాళ్, ఏఈ సువర్చలా, రాంబాబు, సాగునీటి సంఘాల అధ్యక్షులు కర్ణ శ్రీనివాసరావు, వాకా పాపారావు, ఉపాధ్యక్షుడు డొక్కు శ్రీను, టీడీపీ నాయకులు మోటూరి పుణ్య శ్రీనివాసరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

అమృతలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిదిలోని బోడపాడు గ్రామానికి చెందిన విశ్వంశెట్టి వెంకట నాగగౌరి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. పేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి అర్జీ అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లెటర్ ఆఫ్ క్రెడిట్ రూపంలో రూ.4 లక్షలు మంజూరు చేశారు. ఈ చెక్కును నాగగౌరి కుటుంబసభ్యులకు గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో అందజేశారు.

జనసేన నేత రాజేష్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

వేమూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జనసేన నియోజకవర్గ సమన్వయకర్త ఉసా రాజేష్‌పై వేమూరు పోలీసులు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. చావలి గ్రామానికి చెందిన పోతుల కొండయ్యను కులం పేరుతో దూషించడంతో పాటు నడి బజారులో చెప్పుతో కొట్టినట్లు కొండయ్య వేమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి రాజేష్ బినామీగా లోను పొందేందుకు సహకరించాలని కోరగా అందుకు అంగీకరించకపోవడంతో కక్ష కట్టిన రాజేష్ తన గురించి వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడని ఫోన్ చేసి పిలిచి చావలి మెయిన్ రోడ్డులోని శ్మశాన వాటిక వద్దకు పిలిచి దాడి చేసి చెప్పుతో కొట్టి కులంపేరుతో దూషించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు వేమూరు పోలీసులు కేసు నమోదు చేసినట్లు వివరించారు. అదే విధంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు విచారణలో భాగంగా బుధవారం రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు ఫిర్యాదుదారులతో సంఘటన గురించి విచారణ జరిపినట్లు పోలీసులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లాలి : ఏడీఏ

వేమూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మహిళా సంఘాలు ప్రకృతి వ్యవసాయాన్ని ముందుకు తీసుకువెళ్లాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయబాబు పిలుపునిచ్చారు. వేమూరులో మండల వ్యవసాయ శాఖ అధికారిణి సునీత అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై బుధవారం మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. హాజరైన విజయబాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎటువంటి రసాయనిక ఎరువులు లేకుండా పుష్టికరమైన పంటలను పండించుకోగలమన్నారు. సునీత మాట్లాడుతూ, 2025వ సంవత్సరం ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ వివరించారు. ఈ సందర్భంగా ఆదర్శ రైతులు గోవతోటి అనిత, నర్రావుల రామస్వామిలను సన్మానించారు. సన్మాన గ్రహీతలు ప్రకృతి వ్యవసాయం విధానంలో వారి అనుభవాలను వివరించారు. మండల సమాఖ్య అధ్యక్షులు వీవో అధ్యక్షులు, వీవోఏలు, సీఏఎలు, మాస్టర్ ట్రైనర్స్ ప్రసాద్, ఎన్ఎఫ్ఏ వరదానమ్మ, ఏడీపీఎం మోహన్, మండల పరిధి గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులు హాజరయ్యారు.

కోర్టు ప్రాంగణంలో వైద్య పరీక్షలు



శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ

రేపల్లె, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : తోటివారికి సాయపడాలనే సద్గుణంతో ఇండియన్ రెడ్‌క్రాస్, బార్ అసోసియేషన్ ముందుకు వెళ్ళటం అభినందనీయమని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రూపశ్రీ అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో రేపల్లె బార్ అసోసియేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, ఫోకస్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య మాట్లాడుతూ సీనియర్ సివిల్ జడ్జి టి.వెంకటేశ్వర్లు శిబిరాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కుమారి గీతాభార్గవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గరికపాటి వెంకట గిరిధర్, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవం

చెరుకుపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కావూరులో శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి కల్యాణం చేసి అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తుమ్మల రామకృష్ణ, తుమ్మల సుబ్బారావు, ఆలయ అభివృద్ధి కమిటి, గ్రామప్రజలు పర్యవేక్షించారు. ఈ అన్నసమారాధనను తుమ్మల కాళిదాసు జ్ఞాపకార్థం వారి కుమారులు ఏర్పాటు చేశారు.

ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చెరుకుపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి మండలం తుమ్మలపాలెం పంచాయతీ పరిధిలోని అక్కల వెంకటరెడ్డిపాలెంలో బుధవారం ప్రసన్నాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామపెద్దలు గ్రామ హనుమత్ భక్త బృందం ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాలు, విగ్రహ ప్రతిష్ఠ కనులపండుగగా జరిగింది. ఈ ప్రతిష్ఠ కార్యక్రమంలో వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్, మాజీ సర్పంచ్ పిట్టు అప్పిరెడ్డి, పిట్టు సాంబిరెడ్డి, దుండి వెంకటరెడ్డి, అర్చకస్వాములు అక్కల అంజిరెడ్డి, అక్కల గోపిరెడ్డి పాల్గొన్నారు. అన్నసంతర్పణ చేశారు.

కామినేనివారిపాలెంలో...

చెరుకుపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కామినేనివారి పాలెంలోని శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో నూతన జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. చీరాల మండలం పేరాలకు చెందిన దాత ఆదిన శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ దంపతులు స్వామి వారి హోమ కార్యక్రమాలలో పాల్గొని ధ్వజస్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. అన్నసంతర్పణ నిర్వహించారు.

సూరీడు.. సుర్రు


ఎండ దాటికి గొడుగుతో..



రిక్షా కార్మికుడి జీవన పోరాటం


ప్లెక్సీ కప్పుకున్న వృద్ధుడు

ఒకవైపు పైన తలమాడుతోంది.. మరోవైపు కింద భూమి పెనంలా మాడుతుంది.... అయినా కష్టజీవులు జీవన పోరాటం సాగిస్తూనే ఉన్నారు...... కొన్నిచోట్ల విద్యార్థులు చెప్పులు లేక కాలుతున్న ఎండలోనే కాళ్లు బొబ్బలెక్కేల పరిగెడుతూ ఇంటి బాట పడుతున్న వైనం... జగనన్న ఇచ్చిన విద్యా కానుకలో బూట్లు ఏమయ్యాయో తెలియదు పరిస్థితి.. ఇదీ బుధవారం గుంటూరులో కనిపించింది.

-గుంటూరు (ఆంధ్రజ్యోతి)






కాళ్లకు చెప్పులు లేక ఎండ వేడిమికి విద్యార్థుల ఇక్కట్లు

ఒక్కొక్కటిగా.. రైళ్లన్నీ చర్లపల్లికి

● సికింద్రాబాద్ స్టేషన్ పునరాభివృద్ధి పనులతో రైల్వే శాఖ నిర్ణయం ● ఇప్పటికే ఏడు రైళ్ల టెర్మినల్స్ మార్పు ● మరికొద్ది రోజుల్లో ఇంకొన్ని రైళ్లను మార్చే అవకాశం

గుంటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్ నిర్మాణ పనులు కారణంగా గుంటూరు నుంచి వెళ్లే చాలా రైళ్లను చర్లపల్లి స్టేషన్‌లోనే రైల్వే శాఖ ప్రయాణాన్ని నిలిపేస్తున్నది. లింగంపల్లి వెళ్లాల్సిన రైళ్లలో కొన్నింటిని చర్లపల్లి నుంచి సనత్‌నగర్‌కు మళ్లించి ఆ తర్వాత లింగంపల్లికి చేరుస్తున్నది. దీంతో ఎన్నో ఏళ్లగా ఇక్కడి ప్రయాణికులు సికింద్రాబాద్/హైదరాబాద్ రైల్వేస్టేషన్లలో దిగి వెళ్లేవారు ఇప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఒంటరిగా వెళ్లే యువతులు, మహిళలు చర్లపల్లిలో దిగేసి అక్కడి నుంచి రూంలు/హాస్టల్స్‌కు చేరుకోవడానికి తీవ్ర అసౌకర్యానికి గురౌతున్నారు. రైల్వే శాఖ చర్లపల్లి టెర్మినల్‌కి రైళ్లను మారుస్తుండటం తాత్కాలికమే అని చెబుతున్నప్పటికీ రాబోయే రోజుల్లో పెరిగే రద్దీ నేపథ్యంలో దానినే శాశ్వతం చేసే అవకాశం లేకపోలేదు.

వారంలో రెండు రోజులు గుంటూరు మీదగా నాగర్‌సోల్ వెళ్లే బైవీక్లీ ఎక్స్‌ప్రెస్‌ని ఇప్పటికే చర్లపల్లికి మార్చేశారు. అలానే చెన్నై, జన్మభూమి, రేపల్లె, శిల్పార్ ఎక్స్‌ప్రెస్‌లతో పాటు విల్లుపురం, శ్రీకాకుళం రోడ్డు, కన్యాకుమారి తదితర స్పెషల్స్‌ని కూడా చర్లపల్లికి మార్చేసింది. త్వరలో మరికొన్ని రైళ్ల టెర్మినల్స్‌ని కూడా చర్లపల్లికి మార్చే అవకాశం ఉందని రైల్వేవర్గాల ద్వారా తెలిసింది. చర్లపల్లి రైల్వేస్టేషన్ సికింద్రాబాద్‌కు దాదాపుగా 15 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. అక్కడి నుంచి సిటీ బస్సు సౌకర్యాలు కూడా అంతంత మాత్రమే. ఒక రైలులో దాదాపుగా 1500 మందికి పైగా ప్రయాణికులు అక్కడ దిగుతుంటారు. దీంతో అంతమంది సిటీ బస్సుల్లో గమ్యస్థానాలకు వెళ్లాలంటే చాలా కష్టం. చెన్నై ఎక్స్‌ప్రెస్ వేకువజామున 5.10 గంటలకల్లా చర్లపల్లి చేరుకొంటుంది. అప్పటి నుంచి సిటీ బస్సులు కదలాలంటే కనీసం గంటకు పైగా అక్కడ నిరీక్షించాల్సి వస్తున్నదని ప్రయాణికులు వాపోతున్నారు. ఒకవేళ సికింద్రాబాద్‌లో వీలు పడకపోతే గతంలో వలే హైదరాబాద్(నాంపల్లి)లో టెర్మినేట్ చేస్తే అక్కడి నుంచి మెట్రో/సిటీ బస్సుల్లో గమ్యస్థానాలకు చేరుకోవచ్చని చెబుతున్నారు.

ప్రస్తుతానికి లింగంపల్లి వెళ్లే ఇంటర్‌సిటీ, వందేభారత్, పల్నాడు, విశాఖ, ఫలక్‌నుమా, శబరి, ఎల్‌టీటీ, డెల్టా, నరసపూర్, నారాయణాద్రి, వయా వరంగల్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లు మాత్రమే సికింద్రాబాద్ వెళుతున్నాయి. వీటిల్లో కూడా కొన్నింటిని కొద్ది రోజుల్లోనే చర్లపల్లికి మార్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. అప్పుడు ఇక్కడి నుంచి సికింద్రాబాద్‌కు వెళుతున్న ప్రయాణికులకు కష్టాలు మరింత పెరుగుతాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఎంఎంటీఎస్ రైళ్లను నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ప్రధాని పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు

● సభా వేదిక వద్దకు చేరుకునేందుకు 8 రోడ్ల గుర్తింపు ● రూ. లక్ష కోట్ల విలువైన పనులను పీఎం మోదీ ప్రారంభిస్తారన్న మంత్రి నారాయణ ● రోడ్ల పనులు అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశం

తుళ్లూరు, గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి పనులను పునః ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ నేపథ్యంలో వచ్చేనెల రెండో తేదీన ప్రధాని హాజరయ్యే సభా ప్రాంగణానికి సంబంధించిన పనులు, సభా ప్రాంగణానికి చేరుకునే రహదారుల పనులు కొద్దిరోజులుగా నిర్విరామంగా సాగుతున్నాయి. ప్రధాని పర్యటన విజయవంతం చేసందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. ఇప్పటికే పలు పనులు తుది దశకు చేరుకున్నాయి.

గతంలో రూ. 5వేల కోట్ల వ్యయం

గతంలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగానే రాజధాని అమరావతి శంకుస్థాపన జరిగింది. 2014- 19 మధ్య అమరావతి నిర్మాణానికి ఐదువేల కోట్లకుపైగా అప్పటి టీడీపీ ప్రభుత్వం ఖర్చు చేసింది. అనేక భవనాలు, రోడ్లు నిర్మించింది. వాటిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఆలిండియా సర్వీస్ ఉద్యోగుల భవనాల పనులు 80 శాతానికిపైగా పూర్తయ్యాయి. అనేక రహదారుల నిర్మాణం కూడా జరిగింది. కానీ గత ప్రభుత్వం రాజధాని విషయంలో మూడు ముక్కలాటాడి, ఎక్కడా రాజధాని లేకుండా నిర్వీర్యం చేసింది. అమరావతి ప్రాంతాన్ని అడవిలా మార్చేసింది. కూటమి ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు అమరావతిలో పర్యటించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఆ నేపథ్యంలోనే రూ.64 వేల కోట్లతో టెండర్లు పిలవడానికి సీఆర్డీఏ అథారిటీలో నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకూ రూ.41 వేల కోట్ల పనులకు టెండర్లు పూర్తయి


ప్రధాని సభ వద్ద చదును చేస్తున్న భారీ యంత్రాలు


రెడీ చేస్తున్న వెస్ట్‌బైపాస్

పనులు కూడా ప్రారంభమయ్యాయి. ప్రధాని చేతుల మీదుగా ఈ పనులను లాంఛనంగా పునఃప్రారంభించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించడంతో అందుకనుగుణంగా అమరావతిలో ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి.

● 1.1 కి.మీ మేర రోడ్ షో.. 5లక్షల మందితో సభ

వచ్చే నెల రెండో తేదీన ప్రధాని మోదీ అమరాతికి రానున్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు గన్నవరం ఎయిర్ పోర్ట్‌కు చేరుకుం టారు. అక్కడి నుంచి అమరావతికి వచ్చి 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షోలో పాల్గొని బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సభ జరుగుతుంది. సుమారు 5 లక్షల మంది ప్రజలు సభకు వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ- 11, ఈ- 13, ఈ- 15 రోడ్లతో పాటు సీడ్ యాక్సిస్ రోడ్డు నుంచి రాకపోకలు జరుగుతాయి. ఇప్పటికే పోలీస్ శాఖ రోడ్లు పరిశీలించి గుంతలు పూడ్చాలని కోరింది. ప్రధాని సభకు వచ్చే వాహనాల కోసం మొత్తం 11 పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటుచేస్తున్నారు. మొ త్తం 8 రోడ్ల ద్వారా సభా వేదిక వద్దకు చేరుకునేలా రవాణా ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళగిరి నుంచి రెండు రోడ్లు, తాడేపల్లి నుంచి ఒకటి, వెస్ట్ బైపాస్ నుంచి ఒకటి, ప్రకాశం బ్యారేజి నుంచి రెండు,

తాడికొండ నుంచి ఒకటి, హరిశ్చంద్రాపురం నుంచి ఒక రోడ్డు ద్వారా సభా వేదిక వద్దకు చేరుకోవచ్చు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ జామ్ కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలీస్ శాఖ సూచనల మేరకు రెండు రోజుల్లోగా రోడ్లన్నీ సరిచేయాలని సీఆర్డీఏ అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు.

5 లక్షల మందికి తగ్గట్లుగా ఏర్పాట్లు: మంత్రి నారాయణ

అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి 5 లక్షలమంది హాజరవుతున్నారని అంచనా వేస్తున్నామని, అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి నారాయణ తెలిపారు. రాజధాని అమరావతిలో వచ్చే నెల రెండో తేదీన జరగనున్న ప్రధాని పర్యటన, సభ ఏర్పాట్లను రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరి నారా యణ బుధవారం పరిశీలించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌తో కలిసి రెండుగంట లపాటు రాజధానిలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించిన ఆయన ప్రధాని సభ నేపథ్యంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే సభావేదిక వద్దకు వెళ్లేం దుకు అవసరమైన రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మే రెండో తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని గన్నవరం ఎయిర్ పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి అమరావతికి వచ్చి 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షోలో పాల్గొని బహిరంగ సభ వేదిక వద్దకు చేరుకుంటారని, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ సభలో పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు సుమారు 5 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నామని, అందుకు తగినట్లుగా ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించారు. సభ నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ప్రజల రాకపోకలకు మొత్తం 8 రోడ్లను, 11 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్

గ్రామాలను చెత్త రహితంగా మారుద్దాం


చేబ్రోలులోని సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ వద్ద అధికారులతో కొమ్మారెడ్డి పట్టాభిరామ్

పొన్నూరుటౌన్(చేబ్రోలు) ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గ్రామాలను చెత్త రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తెలిపారు. చేబ్రోలులోని సాలిడ్ వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను బుధవారం కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తనిఖీ చేశారు. ప్లాంట్‌లో ఉన్న వివరాలు,యాప్‌లో నమోదు చేసిన వివరాలకు వ్యత్యాసం ఉండడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపద సృష్టి కేంద్రాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్లక్ష్యంగా కారణంగా రాష్ట్రంలో 85 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణ ప్రాంతాలలో చెత్తను తొలగించే పనులు చేపట్టినట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో డ్రోన్ సర్వేల ద్వారా చెత్తను తొలగించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు వివరించారు. చెత్త సెగ్రిగేషన్ విషయంలో ఖచ్చిత మైన డేటాను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసేలా కృషి చేస్తామన్నారు. గ్రామ పంచాయతీలు సైతం ఇంటింటి నుంచి చెత్తను సేకరించి ప్రాసెస్ చేస్తున్నట్లు చెప్పారు. పీఆర్1 యాప్ ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో సందప సృష్టి కేంద్రాల నిర్వహణను పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. గురువారం జరగబోయే జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీపీవో సాయికుమార్, ఎంపీడీవో ఉమాదేవి, ఈవోపీఆర్డీ ఉషారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు షైలా రామరాజు, జనసేన అధ్యక్షుడు చందు శ్రీరాములు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మండు వేసవిలో ఊరిస్తున్న తాటి ముంజలు

చిలకలూరిపేట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేటలో తాటి ముంజల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. బాపట్ల జిల్లా కోలలపూడి, బొల్లాపల్లి ప్రాంతాల నుంచి ఆటోలలో తీసుకువచ్చి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విక్రయిస్తున్నారు. ప్రధానంగా స్థానిక నరసరావుపేట సెంటర్లో డివైడర్లపై వీటి విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఒక్కొక్క తాటికాయలో మూడు ముంజలు ఉంటాయి. తాటికాయ ధర రూ. 20 వరకు పలుకుతున్నది. తాటికాయల నుంచి ముంజలను తీశాక వచ్చే వ్యర్థాలను ఆటోలలో తిరిగి తీసుకువెళుతున్నారు. వాటిని గేదెలు, ఎద్దులు ఎంతో ఇష్టంగా తింటాయని ముంజల విక్రయిదారులు చెబుతున్నారు.

తాటి ముంజలతో ఎన్నో ప్రయోజనాలు

ఎటువంటి రసాయనాల ప్రభావం లేకుండా సహజ సిద్ధంగా లభించే తాటికాయలలోని ముంజలు పోషకాల పరంగా, ఆరోగ్య పరంగా ఎంతో మంచి ఆహారం. వేసవిలో తాటి ముంజలు తింటే శరీర ఉష్ణోగ్రతను తగ్గించి చల్లదనాన్ని ఇస్తాయి. ముంజలలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల శరీరానికి తక్షణ శక్తినివ్వడమే కాకుండా శరీరం డీహైడ్రేషన్ అవ్వకుండా ఉంటుంది. ఫైబర్ అధికంగా ఉన్న



కారణంగా ఇవి జీర్ణక్రియకు కూడా సహాయపడతాయి. మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తా యి. రోగనిరోధక శక్తిని పెంచుతాయి. వీటిలో పొటాషియం, కాల్షియం, ఐరన్ వంటి ఖనిజాలతో పా టు బీ, సీ విటమిన్లు ఉంటాయి. కాకపోతే ఒకే రోజు, ఒకే విడత వీటిని ఎక్కువ మొత్తంలో తినకూ డదు. రోజుకు100 గ్రాముల వరకు తినొచ్చు.100 గ్రాముల ముంజల్లో 43 కేలరీలు లభిస్తాయి.11 గ్రాముల కార్బోహైడ్రేట్లు అందుతాయి. ఇక పిల్లలకు పాలిచ్చే తల్లులు ముంజలను తినడం మంచిది. ఇవి తల్లిపాలను వృద్ధి చేస్తాయి. వేసవిలో తాటి ముంజలు తినడం ఆరోగ్యానికి అన్ని విధాలా మంచిది.

మొక్కజొన్న పేరుతో మెక్కేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

వారు కప్పం కట్టాల్సిన పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఒక్కో ర్యాక్‌కు రూ. 2 లక్షల వరకు వసూలు చేస్తూ వచ్చారు. దీని వెనుక అప్పట్లో మార్కెటింగ్ శాఖలో పనిచేస్తున్న ఇద్దరు కిందిస్థాయి ఉద్యోగులు కూడా ఉన్నారనే ప్రచారం ఉంది. వారిని అడ్డుపెట్టుకుని ఒకే వ్యక్తి ర్యాక్‌లు బుక్ చేయటం, ఒకవేళ అతనితో సంబంధం లేకున్నా వ్యాపారులే బుక్ చేసుకున్నా, దానిలో సరకు లోడ్ చేయాలన్నా, ర్యాక్ కదలాలన్నా కప్పం కట్టాల్సిందేననే హుకుం జారీ చేశారు. దీనికి అప్పటి వైసీపీ నేతలు కూడా అండగా నిలిచారనే ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు ఆ కప్పం కంపు కూటమి నేతలకూ పులుముతున్నారు. అడ్వాన్స్‌డ్ ర్యాక్‌ల బుకింగ్‌తో అక్రమ దందాకు రంగంలోకి దిగిన కొందరు వ్యాపారులు కూటమి నేతల పేర్లుచెప్పి మరీ బహిరంగంగానే వసూళ్లకు దిగుతున్నారు. తెలుగుదేశం, జనసేన, నేతల పేర్లు చెప్పి వసూళ్లకు తరలీశారు. ఇవన్నీ మాకు కాదని, నేతలకు కట్టాల్సిందేనంటూ బహిరంగంగానే చెప్పటం కొసమెరుపు.

ర్యాక్‌ల ద్వారా రూ. కోటిన్నర లక్ష్యంగా...

పంట పండించలేదు... పండిచిన రైతుల దగ్గర నుంచి డబ్బుపెట్టి సరకు కొననూలేదు. కేవలం అధికార పార్టీల అండే వారికి దందాకు ఊతంగా మారింది. వైసీపీ ప్రభుత్వ కాలంలో కప్పం వ్యవహారం కంపు కొట్టినా, అధికార పార్టీ నేతలు సంపాదనే లక్ష్యంగా రూ. కోటిన్నర కోసం టార్గెట్ పెట్టుకుని వసూళ్ల దందాకు దిగారనేది వ్యాపారుల ఆరోపణ. ఒక్క తెనాలి నుంచే మొక్కజొన్న, జొన్న లోడుతో ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు 35 నుంచి 40 వరకు ర్యాక్‌లు ఇతర రాష్ట్రాలకు వెళ్లటం పరిపాటి. కేవలం దీనిపైనే రూ. కోటిన్నర లక్ష్యంగా పెట్టుకున్నారో! లేక గత వైసీపీ ప్రభుత్వంలో వసూళ్ల రాయుళ్లను మంచివాళ్లను చేద్దామనుకున్నారో కానీ, ఈ ఏడాది ఒక్కో ర్యాక్‌కు తమ సొంత ఎగుమతి సుంకాన్ని రూ. 3 నుంచి రూ. 4లక్షల వరకు పెంచేశారు. ఒకే ఏడాది అంత మొత్తంలో అనధికార వసూళ్లు పెంచేయటంతో వ్యాపారుల్లో నిరసన వ్యక్తమయింది. అదేమని ఎవరైనా అడిగినా ఇవన్నీ మాకు కాదని, పార్టీ నేతలకు పంపాలంటూ ఏలూరు, తెనాలి, బాపట్ల జిల్లాల నుంచి వచ్చిన వ్యాపారులు, వసూలు రాయుళ్లు చెప్పుకురావటం విశేషం. అంటే అన్ని ర్యాక్‌లకు కలిపి రూ. కోటిన్నర వరకు వసూలు టార్గెట్‌గా పెట్టిమరీ వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిట్లా ఉంటే... ఇక్కడి నేతలు, ఇక్కడి వ్యాపారులు చాలరన్నట్టు ఏకంగా ఏలూరుకు చెందిన నేత పేరుకూడా తెరపైకి ఓ వ్యాపారి తీసుకురావటంతో స్థానిక వ్యాపారులు విస్తుపోతున్నారు. ఇదంతా ఆయా పార్టీల నేతలకు తెలుసో! లేదో! కానీ ఇక్కడ వ్యాపారులు మాత్రం తెనాలి అడ్డాగా కొందరు కూటమి నేతలకు పనికట్టుకుని మరీ చెడ్డపేరు తీసుకొస్తున్నారు. అయితే ఇప్పటికైనా నేతలు మేల్కొని ఈ అక్రమ వసూళ్ల దందాకు తెరదింపుతారో లేదో!.

ప్రణాళికాబద్ధమైన కృషితోనే..

● పదో తరగతిలో అత్యధిక మార్కులు ● స్కీమ్ ఆఫ్ వాల్యుయేషన్‌పై అవగాహన ఉండాలి ● విద్యార్థుల మనోగతం వారి మాటల్లోనే...

ఆ విద్యార్థులు పదిలో మెరుగైన ఫలితాలు సాధించారు... దీని వెనుక వారు ప్రణాళికాబద్ధంగా చేసిన కృషి, ప్రతిరోజు సబ్జెక్టుల్ని పునఃశ్చరణ చేసుకోవడం....పాఠశాల విద్యాశాఖ జారీ చేసిన స్కీమ్ ఆఫ్ వాల్యుయేషన్‌ను అనుసరిస్తూ పరీక్షలకు సిద్ధం అయ్యారు. అత్యుత్తమ మార్కులు వారు కైవసం చేసుకున్నారు. ఒక్కో సబ్జెక్టులో 98శాతంపైగా ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో నిలిచారు. ఇలా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల్ని ఆంధ్రజ్యోతి పలకరించింది. ఆ వివరాలు వారి మాటల్లోనే...

-గుంటూరు(విద్య), ఆంధ్రజ్యోతి

ప్రారంభం నుంచే పునఃశ్చరణ



పది తరగతులు ప్రారంభం అయిన నాటి నుంచే ప్రతిరోజు పూర్తయిన పాఠాల్ని పునఃశ్చరణ చేసుకుంటూ పరీక్షలకు సిద్ధం అయ్యాను. ప్రశ్నలకు జవాబులు రాసే విధానంపై ఉపాధ్యా యులు ఇచ్చిన సూచనలు ఉపయోగ పడ్డాయని పదిలో 598 మార్కులు సాధించిన గుంటూరులోని చౌత్రా సెంటర్‌కు చెందిన పీవీఎస్ఎస్ శ్రీహాసిని తెలిపారు. ఇంటర్‌లో ఎంఈసీ తీసుకుని సీఏ పూర్తిచేయడమే లక్ష్యమని వెల్లడించారు.

-పీవీఎస్ఎస్ శ్రీహాసిని

ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యం.....



ఇంటర్‌లో ఎంపీసీ పూర్తిచేసి జేఈఈ పరీక్షలో ర్యాంకు సాధించి ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యమని పదిలో 597 మార్కులు సాధించిన ఆలపాటి జ్యోతిర్మయి తెలిపారు. పదిలో సబ్జెక్టుల వారీగా ప్రణాళికతో చదివినట్లు తెలిపారు. ప్రతి అంశాన్ని వదలిపెట్టకుండా పునఃశ్చరణ చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు నాగసురేష్, దుర్గాదేవి పరీక్షల సమయంలో ఎంతో సహకరించారని వివరించారు.

-ఆలపాటి జ్యోతిర్మయి

సివిల్స్ చదవడమే లక్ష్యం...



ఇంటర్ తరువాత బీటెక్ పూర్తి చేసి సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమౌతానని పదిలో 594 మా ర్కులు సాధించిన గుంటూరు లోని శ్రీనివాసరావుపేటకు చెందిన ఆళ్ళ యామిని విద్యాధరి వెల్లడించారు. ఇందుకోసం మరిం త కష్టపడి చదువుతానని చెప్పారు. లక్ష్యసాధన కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా శక్తివంచన లేకుండా శ్రమిస్తానని చెప్పారు.

-యామిని విద్యాధరి

ఐఐటీలో బీటెక్ చేయడమేలక్ష్యం



ఇంటర్ తరువాత జేఈఈ అడ్వాన్స్ ద్వారా ఐఐటీలో సీటు సాధించడమే లక్ష్యమని పదిలో 593 మార్కులు సాధించినట్లు చారుణ్య తెలిపారు. పదిలో సబ్జెక్టుల్ని పూర్తిగా అవగాహన చేసుకోవడంతో పాటు ఎప్పటి పాఠాలు అప్పుడు పూర్తిచేయడం, పాఠశాలలో నిర్వహించే పరీక్షల్లో తప్పులు తెలుసుకుని తుది పరీక్షలకు సన్నద్ధం అయినట్లు వివరించారు. చారుణ్య తెలిపారు.

-చారుణ్య



కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మానాన్ని అందజేస్తున్న కౌన్సిలర్‌లు

అవిశ్వాసానికి సిద్ధం

» ఎట్టకేలకు కలెక్టర్‌కు తీర్మానం అందజేత

» చక్రం తిప్పిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై ఎట్టకేలకు ఎమ్మెల్యే కొండయ్య వర్గం అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్ వెంకటమురళికి అందజేసింది. ఈ విషయం ముందు నుంచే ఆంధ్రజ్యోతి చెప్తున్నా ఉంది. అయితే రెండు మాసాలుగా నలుగుతున్న ఈ అంశానికి బుధవారంతో తెరపడింది. పలుమార్లు బల నిరూపణ విషయంలో ఎమ్మెల్యే కొండయ్య ఏమాత్రం తొణక కుండా, జాగ్రత్తగా అడుగులు వేశారు. ఈక్రమంలో మునిసిపాలిటీపై తనదైన శైలిలో పట్టు సాధించారు. ప్రత్యర్థుల ప్రయత్నాలను తిప్పికొడుతూ అవిశ్వాసానికి సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టర్ వారిని బలంతపు ప్రయోగాలపై సూటిగా ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే అవిశ్వాసానికి వెళ్లిన కౌన్సిలర్లు సానుకూలంగా స్పందిచడంతో తదుపరి ప్రక్రియకు ఆర్డీవో ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిసింది. అయితే మ్యాజిక్ ఫిగర్ ఛేదించిన అనంతరం వారిని ఎమ్మెల్యే ఆస్థానంలోకి మరల్చినట్లు సమాచారం.

రైతులకు సబ్సిడీ పరికరాల పంపిణీ



రోటావేటర్‌ను అందిస్తున్న వ్యవసాయాధికారి

దొనకొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీపై మంజూరైన వ్యవసాయ పరికరాలను రైతుసేవా కేంద్రాల వద్ద బుధవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 23 మంది రైతులకు దాదాపు రూ.4.5 లక్షల సబ్సిడీ పరికరాలు అందజేసినట్లు తెలిపారు. బాటరీ స్ప్రేయర్-1, డ్రైవాన్ స్ప్రేయర్లు-5, రోటావేటర్-1, విత్తనం గొర్రు-1, ట్రాక్టర్ గొర్రులు-15 మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రవితేజ, కమల, విన్నిబాబు, అరుణ, రాధిక, రమేష్, సురేంద్ర, లబ్ధిదారులైన రైతులు పాల్గొన్నారు.

మూగజీవాల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్లు



నీటి తొట్టిని పరిశీలిస్తున్న ఎంపీడీవో బాషా

వెలిగండ్ల, ఏప్రిల్ 23 : (ఆంధ్రజ్యోతి) వేసవి తాపాన్ని దృష్టిలో పెట్టుకుని పశువులకు తాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో నీటి తొట్ల నిర్మాణం చేపట్టిందని ఎంపీడీవో మహబూబ్ బాషా చెప్పారు. బుధవారం మండలంలోని పందువ నాగులవరం పంచాయతీలో నిర్మాణం పూర్తయిన నీటి తొట్లను పరిశీలించారు. ఒక్కో తొట్టి 3వేల లీటర్ల పరిమాణం కలిగి ఉండాలన్నారు. ఈయన వెంట ఏపీవో నాయక్, సిబ్బంది పాల్గొన్నారు

మొక్కజొన్న పేరుతో మెక్కేస్తున్నారు

(5వ పేజీ తరువాయి)

వారు కప్పం కట్టాల్సిన పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఒక్కో ర్యాక్‌కు రూ. 2 లక్షల వరకు వసూలు చేస్తూ వచ్చారు. దీని వెనుక అప్పట్లో మార్కెటింగ్ శాఖలో పనిచేస్తున్న ఇద్దరు కిందిస్థాయి ఉద్యోగులు కూడా ఉన్నారనే ప్రచారం ఉంది. వారిని అడ్డుపెట్టుకుని ఒకే వ్యక్తి ర్యాక్‌లు బుక్ చేయటం, ఒకవేళ అతనితో సంబంధం లేకున్నా వ్యాపారులే బుక్ చేసుకున్నా, దానిలో సరకు లోడ్ చేయాలన్నా, ర్యాక్ కదలాలన్నా కప్పం కట్టాల్సిందేననే హుకుం జారీ చేశారు. దీనికి అప్పటి వైసీపీ నేతలు కూడా అండగా నిలిచారనే ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు ఆ కప్పం కంపు కూటమి నేతలకూ పులుముతున్నారు. అడ్వాన్స్‌డ్ ర్యాక్‌ల బుకింగ్‌తో అక్రమ దందాకు రంగంలోకి దిగిన కొందరు వ్యాపారులు కూటమి నేతల పేర్లుచెప్పి మరీ బహిరంగంగానే వసూళ్లకు దిగుతున్నారు. తెలుగుదేశం, జనసేన, నేతల పేర్లు చెప్పి వసూళ్లకు తరతీశారు. ఇవన్నీ మాకు కాదని, నేతలకు కట్టాల్సిందేనంటూ బహిరంగంగానే చెప్పటం కొసమెరుపు.

ర్యాక్‌ల ద్వారా రూ. కోటిన్నర లక్ష్యంగా...

పంట పండించలేదు... పండిచిన రైతుల దగ్గర నుంచి డబ్బుపెట్టి సరకు కొననూలేదు. కేవలం అధికార పార్టీల అండే వారికి దందాకు ఊతంగా మారింది. వైసీపీ ప్రభుత్వ కాలంలో కప్పం వ్యవహారం కంపు కొట్టినా, అధికార పార్టీ నేతలు సంపాదనే లక్ష్యంగా రూ. కోటిన్నర కోసం టార్గెట్ పెట్టుకుని వసూళ్ల దందాకు దిగారనేది వ్యాపారుల ఆరోపణ. ఒక్క తెనాలి నుంచే మొక్కజొన్న, జొన్న లోడుతో ఏటా ఏప్రిల్ నుంచి జూన్ వరకు 35 నుంచి 40 వరకు ర్యాక్‌లు ఇతర రాష్ట్రాలకు వెళ్లటం పరిపాటి. కేవలం దీనిపైనే రూ. కోటిన్నర లక్ష్యంగా పెట్టుకున్నారో! లేక గత వైసీపీ ప్రభుత్వంలో వసూళ్ల రాయుళ్లను మంచివాళ్లను చేద్దామనుకున్నారో కానీ, ఈ ఏడాది ఒక్కో ర్యాక్‌కు తమ సొంత ఎగుమతి సుంకాన్ని రూ. 3 నుంచి రూ. 4లక్షల వరకు పెంచేశారు. ఒకే ఏడాది అంత మొత్తంలో అనధికార వసూళ్లు పెంచేయటంతో వ్యాపారుల్లో నిరసన వ్యక్తమయింది. అదేమని ఎవరైనా అడిగినా ఇవన్నీ మాకు కాదని, పార్టీ నేతలకు పంపాలంటూ ఏలూరు, తెనాలి, బాపట్ల జిల్లాల నుంచి వచ్చిన వ్యాపారులు, వసూలు రాయుళ్లు చెప్పుకురావటం విశేషం. అంటే అన్ని ర్యాక్‌లకు కలిపి రూ. కోటిన్నర వరకు వసూలు టార్గెట్‌గా పెట్టిమరీ వసూలు చేస్తున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిట్లా ఉంటే... ఇక్కడి నేతలు, ఇక్కడి వ్యాపారులు చాలరన్నట్టు ఏకంగా ఏలూరుకు చెందిన నేత పేరుకూడా తెరపైకి ఓ వ్యాపారి తీసుకురావటంతో స్థానిక వ్యాపారులు విస్తుపోతున్నారు. ఇదంతా ఆయా పార్టీల నేతలకు తెలుసో లేదో! కానీ ఇక్కడ వ్యాపారులు మాత్రం తెనాలి అడ్డాగా కొందరు కూటమి నేతలకు పనికట్టుకుని మరీ చెడ్డపేరు తీసుకొస్తున్నారు. అయితే ఇప్పటికైనా నేతలు మేల్కొని ఈ అక్రమ వసూళ్ల దందాకు తెరదింపుతారో లేదో!.

అన్నదాతల అభ్యున్నతే లక్ష్యం

» రైతులకు అందుబాటులో ఎత్తిపోతల పథకాలు

» ఎమ్మెల్యే ఏలూరి



ఐడీసీ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. బుధవారం ఏలూరి క్యాంప్ కార్యాలయంలో ఐడీసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలను వినియోగంలోకి తెచ్చేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. సకాలంలో ఆరు తడులకు నీరు అందించడమే తన ముందు ఉన్న లక్ష్యమన్నారు. ఎత్తిపోతల పథకాలను రైతులు వినియోగించుకునేలా భాగస్వామ్యం కల్పిస్తున్నట్లు ఏలూరి వెల్లడించారు. వైసీపీ పాలనలో కనీసం మరమ్మతులు కూడా చేయక మూలనపడ్డాయన్నారు. సమస్యను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారని ఏలూరి చెప్పారు. సాగర్ టైల్యాండ్ ఆయకట్టుకు నాలుగు నూతన పథకాలకు రూపకల్పన చేశామన్నారు. పథకాల అభివృద్ధికి అంచనాలను ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారులకు ఏలూరి సూచించారు. నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు భూములకు సైతం నీరు అందించే విధంగా ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. సమావేశంలో ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాగ్యలక్ష్మి, విశ్రాంత ఇరిగేషన్ ఇంజనీర్ సత్యనారాయణ, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గోపినాథ్, శివరామయ్య పాల్గొన్నారు.

నేడు రోటరీ కళా పరిషత్ నాటిక పోటీలు ప్రారంభం



నాటికల ప్రదర్శన సిద్ధమవుతున్న వేదిక

మార్టూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : శ్రీకారం స్వచ్ఛంద సంస్థ, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు ఆధ్వర్యంలో గురువారం రాత్రి స్థానిక మద్ది సత్యనారాయణ కంపెనీ ఆవరణలో శ్రీకారం రోటరీ కళా పరిషత్ నాటిక పోటీలను ప్రారంభిస్తున్నట్లు శ్రీకారం సంస్థ కార్యదర్శి జాష్టి అనూరాధ, రోటరీ అధ్యక్షుడు మద్దుమాల కోటేశ్వరరావు బుధవారం ప్రకటనలో తెలిపారు. మొత్తం 10 నాటికలను ప్రదర్శిస్తారు. గురు, శుక్ర, శనివారాలు నాటికలను ప్రదర్శిస్తారు.ప్రదర్శించిన ప్రతి నాటికకు పారితోషికంతో పాటు ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందజేస్తారు. దాంతోపాటు వ్యక్తిగత బహుమతులను కళాకారులకు అందచేస్తారు. ఈ నాటిక పోటీలను రోటరీ గవర్నర్ జిల్లా 3150 డాక్టరు కే శరత్‌చౌదరి ప్రారంభిస్తారని, ఆత్మీయ అతిథులుగా వేదిక ఉపాధ్యక్షుడు పీవీ మల్లికార్జునరావు విచ్చేస్తారన్నారు. అదేవిధంగా పోటీలను ప్రారంభిస్తూ రాత్రి మొదటిగా న్యూస్టార్ మోడరన్ థియేటర్ విజయవాడ వారిచే కపిరాజు నాటిక, రెండో ప్రదర్శనగా రసఝురి పొన్నూరు వారిచే గురితప్పినవేట నాటిక, యంగ్ థియేటర్ విజయవాడ వారిచే 27వ మైలురాయి నాటికను ప్రదర్శిస్తారు. చివరగా రోటరీ కళాపరిషత్ సభ్యులతో 50కోట్లు నాటికను ప్రదర్శిస్తారు. ప్రదర్శనల కోసం రంగస్థల కళా వేదికను సిద్ధం చేశారు. అదేవిధంగా నాటికల ప్రదర్శనలను తిలకించిన మహిళలకు ప్రత్యేక బహుమతులుగా చీరలను లాటరీ ద్వారా ఎంపిక చేసిన వారికి నిర్వాహకులు అందజేయనున్నారు.

నాటి కట్టడం కనుమరుగే



అద్దంకిలోని 175 సంవత్సరాల నాటి తహసీల్దార్ కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయాన్ని తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

175 ఏళ్ల నాటి తహసీల్దార్ కార్యాలయ భవనం తొలగింపు

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అద్దంకిలోని మరో పురాతన భవనం కనుమరుగు కానుంది. సుమారు 175 ఏళ్ల కిందటి తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని తొలగిస్తున్నారు. 1850 ప్రాంతంలో అప్పటి నెల్లూరు జిల్లా పరిధిలోని అద్దంకి కేంద్రంగా తాలూకా ఏర్పడింది. అప్పట్లో పెంకులతో తహసీల్దార్ కార్యాలయం నిర్మాణం జరిగింది. సుమారు 15 సంవత్సరాల క్రితం వరకు ఇదే భవనంలో తహసీల్దార్ కార్యాలయం కొనసాగింది. కొత్తభవనం నిర్మాణంతో అక్కడ నుంచి మార్చు చేశారు. దీంతో ఖాళీగా ఉంది. మున్సిపల్ కార్యాలయ భవనం నిర్మాణానికి తొలుత పరిశీలన చేసినప్పటికీ స్థలం సరిపోదన్న ఉద్దేశంతో ఉపసంహరించుకున్నారు. కొత్తగా పట్టణానికి రెండు ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లు మంజూరైన నేపథ్యంలో ఒకటి ఎస్ఎస్‌పీ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్నారు. రెండవది పాత తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని తొలగించి ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసేందుకు సిద్ధం కావడంతో ఎక్స్‌కవేటర్‌తో పాత తహసీల్దార్ కార్యాలయ భవనాన్ని తొలగించే పనులు ప్రారంభించారు. త్వరలో 15 ఏళ్ల నాటి భవనం పూర్తిగా కనుమరుగు కానుంది.



విచారిస్తున్న చీరాల డీఎస్పీ మొయిన్

రూ.5లక్షలు చోరీ

» మేనల్లుడి పెళ్లికి బంగారు కొనేందుకు డ్రా చేసిన నగదుతో పరార్

» కేసు నమోదు

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద నుంచి తెచ్చిన రూ.2లక్షలతో పాటు బ్యాంక్ నుంచి డ్రా చేసిన మరో రూ.3లక్షల నగదును మోటార్‌సైకిల్ ట్యాంక్ కవర్‌లో ఉంచగా, దొంగలు అపహరించుకు పోయారు. ఈ ఘటన అద్దంకి పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బల్లికురవ మండలం కూకట్లపల్లికి చెందిన చాగంటి దానసూరబాబు తన మేనల్లుడు పెళ్లి కోసం బంగారం కొనుగోలు చేసేందుకు బుధవారం అద్దంకి వచ్చారు. ఇంటి వద్ద నుంచి రూ.2లక్షలు తీసుకురాగా, అద్దంకి పట్టణంలోని ఎస్‌బీఐ (ఏడీబీ)లో నుంచి రూ.3లక్షల నగదు డ్రా చేశారు. మొత్తం నగదు ను హ్యాండ్ క్యాష్ బ్యాగ్‌లో పెట్టుకొని పాతబస్టాండ్‌లో టిఫిన్ చేస్తున్నారు. అదే సమయంలో మోటార్‌సైకిల్‌పై ఇద్దరు యువకులు వచ్చి నగదు ఉన్న క్యాష్‌బాగ్‌ను తీసుకొని మేదరమెట్ల వైపు వెళ్లిపోయారు. బాధితుడు దానసూరబాబు అరుస్తూ వెంబడించినప్పటికీ దొంగలు వేగంగా మోటార్‌సైకిల్‌పై వెళ్లిపోయారు. పోలీస్‌లకు ఫిర్యాదు చేయడంతో సీఐ సుబ్బరాజు వెంటనే బ్యాంక్‌కు వెళ్లి నగదు లావాదేవీలు, సీసీ పుటేజ్‌ని పరిశీలించారు. రూ.3లక్షల నగదును డ్రా చేసినట్లు గుర్తించి ఆ మేరకు చోరీ జరిగినట్లు కేసు నమోదు చేశారు. బుధవారం రాత్రి చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి బాధితుడు నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పట్టణ పరిధిలో నామ్ రోడ్డు వెంబడి ఉన్న సీసీ కెమెరాలలో పుటేజ్‌లను పరిశీలిస్తున్నారు. బ్యాంక్‌లో నగదు డ్రా చేసేటప్పటి నుంచి దానసూరబాబును దొంగలు గమనిస్తూ వెంబడించి చోరీకి పాల్పడినట్లు తెలుస్తుంది.

వాగుభూమి ఆక్రమణపై సర్వే

'ఆంధ్రజ్యోతి' కథనంతో స్పందించిన అధికారులు

వాగు భూమి 15సెంట్లు ఆక్రమణ

తేల్చిన రెవెన్యూ అధికారులు



గోడను తీసివేయాలని నిర్వాహకులను ఆదేశిస్తున్న తహసీల్దార్ రవిశంకర్

కనిగిరి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కనిగిరిలో భూ ఆక్రమణలు పెట్రేగిపోయిన నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ మేరకు పట్టణంలోని కొత్తూరు అంజనేయస్వామి దేవాలయం వెనుక అరకిలోమీటరు దూరంలో అలుగువాగును కొంతమంది అక్రమార్కులు ఆక్రమించి వెంచర్లు వేశారు. దీంతో ఆంధ్రజ్యోతిలో సోమవారం "వాగుభూమి హాంఫట్" అనే కథనం ప్రచురితమైంది. ఈ మేరకు జిల్లా, డివిజన్ స్థాయి అధికారుల ఆదేశాలతో తహసీల్దార్ రవిశంకర్ వాగు భూమిని సర్వే చేపట్టారు. అక్రమంగా వేసిన వెంచర్లలోని హద్దురాళ్లను తొలగించారు. అదేవిధంగా వాగుఆక్రమణ చేస్తూ కట్టిన ప్రహరీ తీసివేయించారు. తహసీల్దార్ నేతృత్వంలో చేపట్టిన సర్వే లో వాగు భూమిని 388/1లోని వాగుభూమిలోని 15సెంట్లు భూమిని 388/2 లోని 2 ఎకరాల్లో అక్రమంగా వేసిన వేసిన వెంచ్చర్ నిర్వాహకుల ఆక్రమించినట్లు తహసీల్దార్ రవిశంకర్ తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి తిరునాళ్ల

దర్శి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పువెంకటాపురంలో బుధవారం శ్రీ వెంకటేశ్వరస్వామి తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రజలు స్వామివారికి పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్లు పొంగించి నైవైద్యం సమర్పించారు. టీడీపీ ఆధ్వర్యంలో రెండు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

వీరయ్యచౌదరికి కన్నీటి వీడ్కోలు

» స్వగ్రామంలో అంత్యక్రియలు పూర్తి

» నివాళులర్పించిన సీఎం చంద్రబాబు

» కుటుంబ సభ్యులకు పరామర్శ

» హంతకులు ఎక్కడ ఉన్నా శిక్షించి తీరుతామని హెచ్చరిక

» పాల్గొన్న మంత్రులు, తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

» జనసంద్రంగా మారిన అమ్మనబ్రోలు

» నిలకడగా ఈదర హరిబాబు ఆరోగ్య పరిస్థితి



వీరయ్య చౌదరి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం చంద్రబాబు, మంత్రి ఆనం, ఎంపి మాగుంట, ఎమ్మెల్యేలు దామచ్ల, బీఎన్, మాజీ ఎమ్మెల్యే గరటయ్య

ఒంగోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులో గత రాత్రి దారుణ హత్యకు గురైన టీడీపీ ముఖ్యనేత, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరికి టీడీపీ శ్రేణులు, జనం కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం సాయంత్రం ఆయన అంత్యక్రియలు స్వగ్రామంలో జరిగాయి. స్వయంగా టీడీపీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అమ్మనబ్రోలు వచ్చి వీరయ్యచౌదరి భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. హత్య జరిగిన వెంటనే విషయం తెలుసుకొని తీవ్రంగా స్పందించిన సీఎం బుధవారం మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో హెలికాప్టర్‌లో జిల్లాకు వచ్చారు. చదలవాడ సమీపంలోని హెలిప్యాడ్ వద్ద దిగి అక్కడి నుంచి కాన్వాయ్‌లో అమ్మనబ్రోలు చేరారు. స్థానిక ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ ప్రాథమికంగా హత్యకు సంబంధించిన అంశాలను బస్సులో సీఎం దృష్టికి తీసుకపోగా, ముందుగానే అక్కడకు చేరిన మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులను కూడా వాకబు చేశారు. అలాగే పోలీస్ అధికారులతో మాట్లాడి పలు విషయాలను తీసుకున్న ఆయన నేరుగా వీరయ్యచౌదరి నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. భార్య కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందని వారిని ఓదార్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి వీరయ్య చౌదరి చేసిన సేవలను కొనియాడుతూ ఇలా క్రూరంగా ఆయనను హత్య చేయడం తనను కలిచివేసిందన్నారు. ఇలాంటి హత్యా రాజకీయాలతో గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం వణికిపోయిందని, టీడీపీ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితికి తావులేదన్నారు. హంతకులు ఎక్కడ ఉన్నా పట్టి తెచ్చి కఠినంగా శిక్షిస్తామని తద్వారా వీరయ్యచౌదరి ఆత్మకు శాంతి చేకూర్చుతామన్నారు.

మధ్యాహ్నం పోస్టుమార్టం పూర్తి

ఇదిలా ఉండగా గత రాత్రి ఒంగోలులో హత్య అనంతరం వీరయ్య చౌదరి మృతదేహాన్ని స్థానిక రిమ్స్ మార్చురీలో ఉంచగా బుధవారం 12గంటల ప్రాంతంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆ సమయంలో రాష్ట్రమంత్రులు వంగలపూడి అనిత, ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, డాక్టర్ స్వామి ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి ఎమ్మెల్యేలు బీఎన్.విజయకుమార్, దామచర్ల జనార్ధన్, అశోక్‌రెడ్డి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ తదితరులు ఆస్పత్రికి వచ్చారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన అమ్మనబ్రోలు తరలించారు. తొలుత ఎంపీ మాగుంట కార్యాలయంలో వారు భేటీ అయ్యి వీరయ్య హత్య తదంతర పరిణామాలపై చర్చించారు. అలాగే బుధవారం జరగాల్సిన డీఆర్సీ సమావేశాన్ని రద్దు చేసుకొని అమ్మనబ్రోలు వెళ్లి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఇదిలాఉండగా మధ్యాహ్న సమయంలో అమ్మనబ్రోలుకు వీరయ్య చౌదరి భౌతికకాయం చేరగా వేలాదిగా టీడీపీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు. గ్రామంతో పాటు మండలంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన వారితో అమ్మనబ్రోలు గ్రామం జనసంద్రంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చిన సమయంలోనూ గ్రామం జనంతో కిటకిటలాడింది. ఆ ప్రాంతంలో సుపరిచితుడు, రాజకీయంగా బలమైన నాయకునిగా వీరయ్యచౌదరి ఉండటంతో కడసారి తమ నాయకుడిని చూసేందుకు ప్రజానీకం తరలిరావడంతో పాటు అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతిమయాత్రలో రాష్ట్రమంత్రులు, టిడిపి కీలక నేతలతో పాటు వీరయ్య చౌదరి సమీప బంధువైన పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందీశ్వరి ఈ ఘటనపై ఆరాతీశారు. మోహన్‌కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవడంతోపాటు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నిలకడగా హరిబాబు ఆరోగ్యం

ఇదిలా ఉండగా తన మేనల్లుడు వీరయ్యచౌదరి దారుణహత్యతో షాక్ తిని గుండెపోటుకు గురైన జడ్పీ మాజీ చైర్మన్ ఈదర హరిబాబు ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉంది. గత రాత్రి రిమ్స్ వద్ద వీరయ్యచౌదరి మృతదేహాన్ని చూసి బోరున విలపించిన హరిబాబుకు ఆ వెంటనే అనారోగ్యం పాలయ్యారు. గుండెపోటుగా ప్రైవేటు వైద్యశాల వైద్యులు గుర్తించి తక్షణ చికిత్స చేయడంతో కొంతమేరకు ఉపశమనం లభించింది. అనంతరం మరోసారి కూడా గుండెపోటు రావడంతో ఆందోళన నెలకొంది. వైద్యులు సీపీఆర్ చేసి ఐసీయూలో వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్సపొందుతున్నారు. దీంతో ఆయన వీరయ్య చౌదరి అంత్యక్రియలకు హాజరు కాలేకపోయారు.

వీరయ్య హత్య కేసుపై సీఎం సమీక్ష

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేత వీరయ్యచౌదరి భౌతిక కాయాన్ని సందర్శించేందుకు బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాగులుప్పలపాడు మండలం అమ్మనబ్రోలుకు విచ్చేశారు. ఈ సందర్భంగా చదలవాడ హెలిప్యాడ్ వద్ద ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. కేసు దర్యాప్తును వేగవంతం చేసి నిందితులను పట్టుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా ఇప్పటివరకు కేసు పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సీఎంవో చీఫ్ సెక్రటరీ ప్రద్యుమ్న, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్‌చంద్ర లడ్హా, లాఅండ్ ఆర్డర్ డీజీ మోహన్‌రెడ్డి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్.దామోదర్ పాల్గొన్నారు.



చినకొత్తపల్లి రోడ్డు వెంబడి తాటి చెట్లను ఆనుకొని వేసిన స్తంభాలు, విద్యుత్ లైన్‌లు

ఇలా అయితే ప్రమాదాలు జరగవా

చెట్లు తొలగించకుండానే

కొత్త కరెంట్ స్తంభాలు, లైన్‌ల ఏర్పాటు

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకోవడం అనే సామెత విద్యుత్ శాఖకు అక్షరాల వర్తిస్తుంది. పట్టణాలు, గ్రామాలు, వ్యవసాయం, పరి శ్రమలకు నాణ్యమైన విద్యుత్‌ను వేరు వేరుగా అందించేందుకు పెద్ద ఎత్తున కొత్తగా విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేస్తున్నారు. అయితే కొత్త విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేసే సమయంలో చిన్న పాటి శ్రద్ధ చూపితే భవిష్యత్‌లో పెద్ద ప్రమాదాలు జరగకుండా ఉండే అవకాశం ఉంది. అయితే నిర్మాణ పనులు చేసే కాంట్రాక్టర్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరించటం, పర్యవేక్షణ అధికారులు పట్టించుకోవకపోవడంతో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్‌లతో పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అత్యధిక శాతం విద్యుత్ స్తంభాలు ఆయా రోడ్ల అంచునే ఏర్పాటు చేయటం జరిగింది. అదే సమయంలో చినకొత్తపల్లి నుండి కొత్తరెడ్డిపాలెం వైపు ఏర్పాటు చేస్తున్న విద్యుత్ లైన్ తాటిచెట్ల అంచునే ఏర్పాటు చేయడంతో విద్యుత్ తీగలు తాటి చెట్ల ఆకులలో కలిసి పోయాయి. ఇలా ఉండటం వల్ల ఒక లైన్ నుండి మరొక లైన్‌కు విద్యుత్ సరఫరా జరిగి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆయా పనులు జరిగే సమయంలో అధికారులు ఖచ్చితంగా పర్యవేక్షణ చేసే విధంగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సర్పంచ్, పూర్వ పంచాయతీ కార్యదర్శిపై క్రిమినల్ కేసులు

» కలెక్టర్ ఆదేశం
» 7 రోజులలో అపరాధ వడ్డీతో జమ చేయాలని సూచన
» ఆ ఇద్దరిపై బిగిసిన ఉచ్చు



చినకొత్తపల్లి గ్రామ సచివాలయం భవనం

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అద్దంకి మండలం చినకొత్తపల్లి సర్పంచ్ గుజ్జుల మల్లిక, అప్పటి పంచాయతీ కార్యదర్శి కె. ఈశ్వరరెడ్డిపై ఉచ్చు బిగిసింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో చినకొత్తపల్లి పంచాయతీ పరిధిలో సుమారు రూ.40లక్షలతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణ పనులు జరిగాయి. ఇందుకు సంబంధించి మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.15,74,283 విలువైన మెటీరియల్‌ను టీడీపీ నేత మానం మురళీమోహన్‌దాస్ సమకూర్చారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిధులు విడుదల కాగా, ఆ మొత్తాన్ని మురళీమోహన్‌దాస్‌కు కాకుండా పంచాయతీ సర్పంచ్ మల్లిక సోదరుడు అయిన చంద్రగిరి వీరారెడ్డికి చెల్లించేందుకు బ్యాంక్ నుంచి పంచాయతీ సర్పంచ్, అప్పటి పంచాయతీ కార్యదర్శి (ప్రస్తుతం సంతమాగులూరు మండలం పాతమాగులూరు పంచాయతీ కార్యదర్శి) డబ్బులు డ్రా చేశారు. ఈ నేపథ్యంలో మానం మురళీమోహన్‌దాస్ అప్పటి నుంచి పోరాటం చేస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మరలా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో అధికారులు కదలి విచారణ చేపట్టారు. వివిధ స్థాయిలలో జరిగిన విచారణ లో నిబంధనలకు విరుద్ధంగా బ్యాంక్ నుంచి డబ్బులు డ్రా చేసి చంద్రగిరి వీరారెడ్డికి చెల్లించినట్లు నిర్ధారణ అయింది. ఇప్పటికే సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేయగా, పునరుద్ధరించాలని సర్పంచ్ మల్లిక కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసుకోగా నిరాకరించారు.

వారం రోజుల్లో అపరాధ వడ్డీతో చెల్లించాలని ఆదేశాలు

క్రిమినల్ కేసు నమోదుకు చర్యలు

మెటీరియల్ కాంపోనెంట్ కింద చెల్లించాల్సిన రూ.15,74,283తో పాటు అపరాధ వడ్డీతో సహా వారంరోజులలో పంచాయతీ ఖాతాకు జమచేయాలని కలెక్టర్ వెంటమురళి ఉత్తర్వులు ఇచ్చినట్లు ఎంపీడీవో శింగయ్య తెలిపారు. నిధులు దుర్వినియోగం రుజువు అయిన నేపథ్యంలో సర్పంచ్ మల్లిక, అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిపై క్రిమినల్ కేసుల నమోదుకు చర్యలు చేపట్టాలని చీరాల డీఎల్‌పీవోను కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డిని సస్పెండ్ చేస్తూ గతంలో జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలు ఇచ్చారు. అయితే సస్పెండ్ చేసే అధికారం జిల్లా పంచాయతీ అధికారికి లేదని పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. ఈనేపథ్యంలో నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు రుజువు అయినందున ఎందుకు చర్యలు తీసుకోకూడదో 10 రోజులలోపు సంజాయిషీ ఇవ్వాలని కలెక్టర్ అప్పటి పంచాయతీ కార్యదర్శి ఈశ్వరరెడ్డికి నోటీసులు ఇచ్చారు. అటు క్రిమినల్ కేసుల నమోదుకు ఆదేశాలు, ఇటు అపరాధ వడ్డీతో మొత్తం డబ్బులు పంచాయతీ ఖాతాకు జమచేయాలని కలెక్టర్ నుంచి ఉత్తర్వులు వచ్చిన నేపథ్యంలో సర్పంచ్, అప్పటి పంచాయతీ కార్యదర్శిపై పూర్తిస్థాయిలో ఉచ్చు బిగిసినట్లు అయింది.

తేజ స్కూల్ జయకేతనం

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షల్లో ఈపూరుపాలెంకు చెందిన తేజ స్కూల్ విద్యార్థి కూరపాటి మనీష్ సత్తా చాటాడు. ఏకంగా 593 మార్కులతో విజయ దుందుభి మోగించాడు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్, డైరక్టర్ జశ్వంత్ ప్రత్యేకంగా అభినందించారు.



కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే కొండయ్య, టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

టీడీపీ నేత హత్య దుర్మార్గ చర్య

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యంలో కొందరు మానవత్వాన్ని మరిచి, దుర్మార్గాలకు ఒడిగడుతూ పాశవిక దాడులకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. చీరాల నియోజకవర్గ మాజీ ఎన్నికల పరిశీలకుడు, సంతనూతల పాడు నియోజక వర్గం టీడీపీ నేత, పార్టీ అధికార ప్రతినిధి ముప్పవరపు వీరయ్య చౌదరిపై గుర్తు తెలియని దుండగులు కత్తులతో దాడిచేసి హత్య చేయడాన్ని ఎమ్మెల్యే కొండయ్య ఖండించారు. దీనిపై ఆయన స్పందిస్తూ వీరయ్య చౌదరి మృతి పార్టీకి, ప్రజలకు తీరని లోటని అన్నారు. వీరయ్య చౌదరితో అనుబంధం ఉందని, స్నేహభావం ఉన్న వ్యక్తి అని కొండయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈనేపథ్యంలో నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్‌తో కలిసి వీరయ్య అంతిమ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రజా దర్బార్‌లో అర్జీల స్వీకరణ

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : గతకొంత కాలంగా నియోజకవర్గం ఎమ్మెల్యే కొండయ్య ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈసందర్భంగా ప్రజల నుంచి పెన్షన్‌లు 50 అర్జీదారులు, నివేశన స్థలాలకు 75, రేషన్ కార్డులకు 5, ఇతర సమస్యలపై ఒక అర్జీని స్వీకరించారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్దనరావు, నియోజకవర్గం నాయకురాలు కొమ్మనబోయిన రజని, రావినూతల నాగేశ్వరరావు తదితర టీడీపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

రామాంజనేయపురంలో ఘర్షణ

రెండు సామాజిక వర్గాలపై కౌంటర్ కేసులు

బల్లికురవ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామాంజనేయపురం గ్రామంలో బుధవారం రెండు సామాజిక వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. గ్రామంలో ఇళ్ల వద్ద గతంలో పైప్ లైన్ వేయగా పాడు చేశారని అలానే ఒక వర్గానికి చెందిన ఒక మహిళకు మరో సామాజిక వర్గానికి చెందిన ఒక యువకుడు ఫోను చేస్తున్నారని అనే కారణాలతో ఆ రెండు వర్గాల మధ్య వివాదం మొదలై కొట్లాటకు దారితీసింది. సంతమాగులూరు సీఐ, వెంకట్రావు, బల్లికురవ, సంతమాగులూరు ఎస్‌ఐలు నాగరాజు, పట్టాభిరామయ్య వెంటనే రామాంజనేయపురం వెళ్లి ఇరు వర్గాలవారిని చెదరగొట్టారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం గోరంట్ల వెంకటాద్రి, అంకసాల ఆశోక్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగరాజు కౌంటర్ కేసులు నమోదు చేసి వారిని ఆసుపత్రికి పంపించారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు ప్రసాద్, హనుమారెడ్డి

మేదరమెట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పొగాకు పండించిన రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం మేదరమెట్లలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లబర్లీ, వైట్ బర్లీ, వర్జీనియా పొగాకును సాగు చేసిన రైతులు తీవ్ర సంక్షోభంలో ఉన్నారన్నారు. నల్లబర్లీ పొగాకు ఇంత వరకు కొనుగోలు కాలేదన్నారు. గత రెండు సంవత్సరాల్లో పొగాకు ధర ఆశాజనకంగా ఉండడంతో రైతులు పొగాకు సాగును పెంచారన్నారు. ఈ సంవత్సరం ధరలు పూర్తిగా తగ్గించడంతో పాటు కొనుగోళ్లు మందగించాయన్నారు. గిట్టుబాటు ధరకు పొగాకు కొనుగోలు చేయ్యాలన్నారు. ప్రభుత్వం స్పందించకపోతే మే 5న రైతులతో సీఎం కార్యాలయం వద్ద ఆందోళనకు దిగుతామన్నారు. ఆయనతో పాటు సంఘ ఉపాధ్యక్షుడు హనుమారెడ్డి తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ రాధామాధవి

పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెంచండి

వేటపాలెం (చీరాల), ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల సంఖ్య పెరిగేలా చూడాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరక్టర్ దొనకొండ రాధా మాధవి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ప్రాజెక్టు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలు దాటిన చిన్నారులను అంగన్వాడీలకు, ఐదేళ్లు దాటిన పిల్లలను పాఠశాలల్లో చేర్పేలా పనిచేయాలని సూచించారు. మే 2 నుంచి జూన్ 10 వరకు జరిగే కిషోర బాలికలకు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో సీడీపీవో ఝాన్సీ, డీసీ సురేంద్ర, ఈవో సుజాత, సూపర్‌వైజర్స్ పుష్పవల్లి, కవిత, లీలావతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మేదరమెట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్ల తిమ్మనపాలెం మధ్య రియల్ ఎస్టేట్ వెంచర్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. బుధవారం స్థానికులిచ్చిన సమాచారంతో ఎస్‌ఐ షేక్ మహమ్మద్ రఫీ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం పాక్షికంగా కుళ్లిన దశలో ఉండగా, చనిపోయి వారం రోజులు అయి ఉంటుందని చెప్పారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

26న వీరాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల

బల్లికురవ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద అంబడిపూడి గ్రామంలోని వీరాంజనేయస్వామి వారి వార్షిక తిరునాళ్ల ఈ నెల 26వ తేదీన జరుగుతుందని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా టీడీపీ పార్టీ తరపున విద్యుత్ ప్రభను ఏర్పాటు చేస్తున్నామని నాయకులు తెలిపారు.

సత్తాచాటిన మదర్‌థెరిస్సా, శ్రీసాయి

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : టెన్త్ పరీక్షల్లో కొత్తపేట మదర్ థెరిస్సా ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ఉత్తమంగా రాణించారు. స్కూల్ విద్యార్థిని అక్షయ 589 మార్కులతో విజయ కేతనం ఎగురవేయగా, నూటికి నూరు శాతం విజయం సాధించినట్లు స్కూల్ ప్రతినిధులు తెలిపారు. ఈక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి కిషోర్ కుమార్, డైరక్టర్ అపర్ణాదేవి, ప్రధానోపాధ్యాయిని కృపావరం విజేతలను ప్రత్యేకంగా అభినందించారు. పది ఫలితాల్లో పేరాల శ్రీసాయి హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. దివ్యసాయి 590 మార్కులు సాధించగా, మరికొందరు 586, 579, 578, 578, 573 సాధించినట్లు తెలిపారు. అలాగే 500కు పైగా మార్కులను 27 మంది సాధించినట్లు చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకటరావు, డైరక్టర్ పద్మజ తదితరులు అభినందించారు.

'పది'లో ప్రభుత్వ విద్యార్థుల విజయఢంకా



హేమలత పందిళ్లపల్లి | హిమబిందు ఈపురుపాలెం | సాయిసంతోష్ మోడల్ స్కూల్ | హర్షిణీ అద్దంకి | తేజయశ్వంత్ శంకవరప్పాడు | సూర్యతేజ తిమ్మయపాలెం

చీరాల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన చిన్నారులు విజయఢంకా మోగించారు. వీరిలో అధిక శాతం బాలికలే ఉండడం విశేషం. ఈక్రమంలో పందిళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన సజ్జా దివ్యశ్రీ 596, నవ్య సుధ 591 మార్కులు సాధించింది. ఈపూరుపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన హిమబిందు 592, బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన శశాంక్ 591, ఏపీ మోడల్ స్కూల్ నాగసాయి సంతోష్ 591, కేజీఎం అమర దీపిక, శైలజ మాధురి 581 మార్కులతో రాణించారు. ఎన్‌ఆర్ అండ్‌పీఎం హైస్కూల్‌కు చెందిన సంతోష్ తేజ 575 సాధించారు. ఆయా పాఠశాల ప్రాంగణాలు బుధవారం సందడిగా మారాయి. ఇదిలావుంటే గురువారం నుంచి జూన్ 11 వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. అయితే జూన్ 4 నుంచే ఉపాధ్యాయులు పాఠశాలలకు రావాల్సి ఉం టుంది. చిన్నారులు వేసవి సెలవులతో బడి నుంచి ఇక ఇంటి బాట పట్టారు.

అద్దంకిటౌన్ : అద్దంకిలోని శ్రీ ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.హర్షిణి 593 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. శంఖవరప్పాడుకు చెందిన తేజ యశ్వంత్ 592తో తిమ్మయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి అమర శ్రీరామసాయి సూర్యతేజ 590 మార్కులు సాధించి తృతీయ స్థానం సాధించారు.

పంగులూరు : మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదోతరగతి పరీక్షలలో 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఆరు ఉన్నత పాఠశాలల నుంచి 392 మంది పరీక్షలకు హాజరు కాగా 318 మంది పాసయ్యారు. చందలూరు పాఠశాలకు చెందిన కట్టా హారిక 590 మార్కులు సాధించి మండలస్థాయిలో ప్రథమ స్థానంలో నిలవగా, జిర్రా మణిదీపక్ రెడ్డి 586 మార్కులతో ద్వితీయ స్థానం, దీపికారాణి 577 సాధించింది. బూదవాడ ఉన్నత పాఠశాలకు చెందిన దివ్య 585, మురళీకృష్ణసాయి 580, షమీర 574, కొండమంజులూరులో సుమన్‌శ్రీ 578, వీరాద్రి 578, పి.భవ్యశ్రీ 577, బి.పూజ 563, పంగులూరుకు చెందిన కార్తీక్ 565, భార్గవాంజలి 555, వైష్ణవి 555, అఖిల్ బాబు 554, అలవలపాడు ఉన్నత పాఠశాల విద్యార్థి వై.వెంకటేశ్వర్లు 534, ముప్పవరం ఉన్నత పాఠశాల విద్యార్థి చింతల పూజిత 534 మార్కులు సాధించారు.

మేదరమెట్ల : రావినూతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని హర్షిత 584 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలో ప్రథమంగా నిలిచింది.పమిడిపాడు 56 మందికి 53, దైవాలరావూరులో 16కు 15, రావినూతలలో 33కు 28 మంది, తిమ్మనపాలెంలో 33కి 27,మేదరమెట్ల హైస్కూల్‌లో 80కి 52 మంది, కొరిశపాడు ఎయిడెడ్ పాఠశాలలో 9కి 8మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో పున్నయ్య తెలిపారు.

బల్లికురవ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఎంఈవో కె.రమేష్ తెలిపారు. 402 మంది పరీక్షలు రాయగా, 334 మంది ఉత్తీర్ణులు కాగా, 83 శాతం ఫలితాలు వచ్చాయన్నారు. కొప్పెరపాడు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి చరణ్ తేజ 590 మార్కులతో మండలంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. నాగ స్రవంతి 586, కేజీబీవీలో 34 మంది రాయగా 32 మంది ఉత్తీర్ణత సాధించి 94 శాతం ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ సరళకుమారి తెలిపారు.

పర్చూరు : పది ఫలితాల్లో పర్చూరు ప్రాంతంలో బాలికలు అత్యధిక మార్కులు సాధించారు. చెరుకూరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన మహాలక్ష్మి 592 మార్కులతో నియోజకవర్గంలో ప్రథమ స్థానంలో నిలిచింది. నాగులపాలెం గురుకుల పాఠశాల విద్యార్థిని జె.గ్రేసి కారుణ్య 586, బాలికల పాఠశాల విద్యార్థిని సమీరా 576, ఉప్పుటూరులో ఎన్.నాగలిఖిత 563 మా ర్కులతో సత్తాచాటారు.

కారంచేడు : కారంచేడు మండలం కొడవలివారిపాలెంకు జడ్పీ స్కూల్‌కు యహోషువా 557 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచాడు.

మార్టూరు : టెన్త్‌లో 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో వస్రాంనాయక్ తెలిపారు. ద్రోణాదుల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని లక్కి శెట్టి భార్గవి 591 మార్కులతో మండలంలోనే టాపర్‌గా నిలవగా, వలపర్ల హైస్కూల్ విద్యార్థి షేక్ ఫోజియా తబస్సుమ్ 590తో రెండో స్థానం, యశ్విత నాగలక్ష్మి 587 మార్కులతో మూడోస్థానంలో నిలిచినట్లు చెప్పారు. కోలలపూడిలో 41 మందికి 40 మంది, ఇసుకదర్శిలో 32 మందికి 30, మార్టూరులో 170కి 129, బొబ్బేపల్లిలో 41కి 41 మంది పాసయ్యారు.

యద్దనపూడి మండలంలో గురుకుల విద్యార్థి శోభారాణి 582 మార్కులుతో మండలంలో మొదటి స్థానం సాధించింది. యద్దనపూడి హైస్కూల్‌కు విచ్చేసిన డీఈవో పురుషోత్తం, చీరాల ఉపవిద్యాశాఖాధికారి గంగాధర్‌రావు, ఎంఈవో గోపి విద్యార్థులను అభినందించారు.

ఇంకొల్లు : టెన్త్ ఫలితాల్లో మండలంలో 91 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు.

చినగంజాం : 414 మంది విద్యార్థులకు గాను 362 మంది విద్యార్థులు పాసై 87 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో అజయ్‌బాబు తెలిపారు. చినగంజాం జడ్పీ పాఠశాలకు చెందిన మాచవరపు సాహితీ 584, బాలజ్ఞానేశ్వరి 582 మార్కులతో మొదటి, రెండు స్థానాలు సాధించినట్లు తెలిపారు.



హర్షిత రావినూతల | హారిక చందులూరు | మహాలక్ష్మి చెరుకూరు | గ్రేసి కారుణ్య గురుకులం | భార్గవి ద్రోణాదుల | షేక్ ఫోజియా వలపర్ల | విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శింగరకొండ ముఖమండపానికి విరాళాలు

అద్దంకి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండప నిర్మాణానికి బుధవారం దాతలు విరాళాలను అందజేశారు. పట్టణంలో నివాసం ఉంటున్న పంగులూరు మండలం కశ్యాపురానికి చెందిన చల్లగుండ్ల రాఘవయ్యచౌదరి జ్ఞాపకార్థం భార్య విజయకుమారి, కుమారులు నరేంద్రకుమార్, కిషోర్‌బాబు ఈవో తిమ్మానాయుడు కు రూ.1,00,116 అందజేశారు. విజయవాడకు చెందిన మాలంపాటి రామకృష్ణ, సీతాలక్ష్మి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని ఈవోకు అందజేశారు.



రూ.లక్ష విరాళాన్ని ఈవో తిమ్మానాయుడుకు అందజేస్తున్న నరేంద్రకుమార్



ఉపాధ్యాయుడు కృష్ణయ్యను సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

ఉపాధ్యాయుడికి సన్మానం

బల్లికురవ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు కేఎస్ఆర్ కృష్ణయ్యను బుధవారం పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. వేసవి సెలవుల్లో ఉద్యోగ విరమణ చేయనున్న ఉపాధ్యాయుడు కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం రవిసాగర్ మాట్లాడుతూ వృత్తిలో నిబద్ధత కలిగిన వ్యక్తి కృష్ణయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధూళిపాళ్ల శేషగిరి, శ్రీనివాసరావు, విజయలక్ష్మి పాల్గొన్నారు.



కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమంలో సంఘీభావం తెలిపిన ఎమ్మెల్యే ఏలూరి, పక్కనే ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ విజయ్ కుమార్

ఉగ్ర దాడిని ఖండిస్తూ నిరసన

పర్చూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదుల దాడి హేయమైన చర్యని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ అన్నారు. కశ్మీర్‌లోని బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ జనసేన పార్టీ పిలుపు మేరకు బుధవారం పర్చూరులో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి హాజరయ్యారు. ఈసందర్భంగా బొమ్మల సెంటర్‌లో జనసేనులు చేపడుతు న్న నిరసన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జనసేనులు కారంపూడి సందీప్‌తేజ, విన్నకోట అజేయ్, తులసి చంటి, ఆకుల వెంకటేశ్వరరావు, కందా సురేంద్ర బాబు, తులసి అప్పారావు, అచ్చకోలు సతీష్, తులసి నాగు, రంగిశెట్టి మారుతి తదితరులు పాల్గొన్నారు.